# పిడుగు పాటుకు రైతు కూలి మృతి

**నగరం, మార్చి 18, ప్రభాత వార్త:** పిడుగు పడి రైతు కూలీ చనిపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ధూళిపూడి గ్రామానికి చెందిన పెరవలి వనజ, వయస్సు 35 సంవత్సరాలు కూలి నిమిత్తం భట్టిప్రోలు మండలం రాచూరి పొలాల్లో మినుము కోతకు వెళ్లి పొలంలో పనిచేస్తుండగా అకస్మాత్తుగా పిడుగు పడి తీవ్రంగా గాయపడింది, కూలీలు వెంటనే స్పందించి ధూళిపూడి వైద్యశాలకు తరలించగారు, మెరుగైన వైద్య సేవ నిమిత్తం మండల కేంద్రంలోని పీహెచ్సీ కి తీసివెళ్లారు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు, అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# బాపట్ల జిల్లా వార్త



## ఆస్తిపన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ సదుపాయం



**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ అధికారుల ఉత్తర్వుల ప్రకారం ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ సదుపాయం అమలులో ఉన్నదని రేపల్లె మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని ఇంటి పన్నులు,ఖాళీ స్థలాలపై పన్నులకు సంబంధించి బకాయిలను ఏక మొత్తంలో చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ చేస్తామని చెప్పారు.ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువుగా నిర్ణయించామని తెలిపారు.సెలవు రోజులలో ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పన్నుల చెల్లింపు కోసం రేపల్లె పురపాలక సంఘ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్ పనిచేస్తుందని సాంబశివరావు వెల్లడించారు.పురపాలక సంఘంలోని ప్రజలు పన్నులను పూర్తిగా చెల్లించి వడ్డీ మాఫీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల, మార్చి 18. ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "దివ్యాంగ శక్తి పథకం ఒక చారిత్రాత్మక ముందడుగు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అభివర్ణించారు. బుధవారం బాపట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఈ పథకాన్ని ఆయన వైభవంగా ప్రారంభించారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో, జిల్లా



స్థాయిలో కలెక్టర్ దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ పొందుతున్న దివ్యాంగులకు, ఇకపై పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

**అర్హత:** 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండి, సదరం ధ్రువీకరణ పత్రం కలిగిన వారందరూ దీనికి అర్హులు అన్నారు.బస్సు

**సర్వీసులు:** పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించ వచ్చని ఆయన తెలిపారు.ఎస్కార్ట్ సదుపాయం: దివ్యాంగుడితో పాటు వచ్చే సహాయకుడికి (ఎస్కార్ట్) టికెట్ ధరలో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు.

**ప్రీమియం సర్వీసులు:** నాన్ స్టాప్, ఇంటర్ స్టేట్, సప్తగిరి, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో దివ్యాంగుడితో పాటు ఎస్కార్ట్‌కు కూడా 50 శాతం రాయితీ వర్తిస్తుంది.

బస్సులో కలెక్టర్ ముచ్చట్లు..పథకం ప్రారంభం అనంతరం, పసుపులేటి లక్ష్మీనారాయణ అనే దివ్యాంగుడిచే పచ్చజెండా ఊపించి, రిబ్బన్ కట్ చేయించి బస్సును కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి బాపట్ల నుంచి జిల్లెలమూడి వరకు బస్సులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో నేరుగా దివ్యాంగుల పక్కన కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా జీరో టికెట్‌ను లబ్ధిదారునికి అందజేశారు. మౌలిక సదుపాయాలపై ఫోకస్‌బస్సుల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక సీట్లు కేటాయించాలని, బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చీరాలతెనాలి మధ్య నేరుగా బస్సు సర్వీసు లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే బాపట్ల నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రేమతో వడ్డించి.. కలిసి భుజించి..కార్యక్రమం అనంతరం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన విందులో కలెక్టర్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి దివ్యాంగుల సరసన కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఏట మల్లికార్జున్ రావు, ఆర్టీసీ ఆర్ఎం సిహెచ్. విమల, ఎంపీడీఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.ప్రస్తుతం ఉన్న పాత బస్సు పాస్‌లు గడువు ముగిసే వరకు చెల్లుతాయని, కొత్త పాస్‌ల కోసం వాట్సాప్ సేవ "మన మిత్ర" ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దివ్యాంగ శక్తి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్ అన్నారు.బుధవారం రేపల్లె ఆర్టీసీ డిపోలో దివ్యాంగ శక్తి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.బస్సులో దివ్యాంగులతో పాటు కొంత దూరం ప్రయాణించారు.ఈ సందర్భంగా డిపో ఆవరణలో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ సహాయకులతో కలిపి రాష్ట్రంలోని 12 లక్షల 76 వేల మందికి ప్రయోజనం చేకూరేలా దివ్యాంగ శక్తి పథకం రూపుదిద్దుకుందని తెలిపారు.ఎపిఎస్ఆర్‌టిసి సిటీ,ఆర్డినరీ,మెట్రో ఎక్స్‌ప్రెస్,పల్లెవెలుగు,అల్ట్రా పల్లెవెలుగు,ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం దివ్యాంగులకు లభించిందన్నారు.ఆర్‌పిడబ్ల్యూడి చట్టం-2016 ప్రకారం 21 రకాల దివ్యాంగులలో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వం కలిగిన వారికి ఉచిత బస్సు ప్రయాణం వర్తిస్తుందని ఆయన వివరించారు.దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టిన దివ్యాంగ శక్తి పథకానికి ప్రయోజనం చేకూరుతుందని అనగాని



శివప్రసాద్ తెలిపారు.ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆయన చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు,రేపల్లె మండల తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు,రేపల్లె ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.వి.వెంకటరమణ తదితరులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు జె.మురళి,ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో దివ్యాంగ శక్తి ప్రభంజనం!

## దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల, మార్చి 18. ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "దివ్యాంగ శక్తి పథకం బాపట్లలో ఉత్సాహంగా ప్రారంభమైంది. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఈ పథకానికి ప్రారంభించారు. తొలుత అక్కడి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం దివ్యాంగుల కోసం కేటాయించిన ఆర్టీసీ బస్సును పచ్చజెండా ఊపి ప్రారంభించారు.

సామాన్యుడిలా బస్సులో.. ఆప్యాయ పలకరింపుకేవలం పథకాన్ని ప్రారంభించి వదిలేయకుండా, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా దివ్యాంగులతో కలిసి బస్సు ఎక్కారు. బాపట్ల నుంచి పిట్టలవానిపాలెం వరకు సామాన్య ప్రయాణికుడిలా వారి పక్కనే కూర్చుని ప్రయాణించారు. ప్రయాణ పొడవునా దివ్యాంగులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం నుంచి ఆశిస్తున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే స్వయంగా తమ పక్కన కూర్చుని సమస్యలు అడగడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ .మంత్రి లోకేష్ మంగళగిరిలో దివ్యాంగులతో కలిసి ప్రయాణించి ఈ పథకానికి అంకురార్పణ చేశారన్నారు. వారి స్ఫూర్తితోనే బాపట్లలో ఈ



కార్యక్రమం చేపట్టాం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే కాకుండా, వారికి సామాజిక భద్రత కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. "దివ్యాంగులకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు.. ప్రభుత్వం మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాపుడాచైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాశ్ నారాయణ, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు బాలనారాయణతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, ఆర్టీసీ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 23నుడి25 వరకు బూరుగులమ్మ మహాకుంభాభిషేక మహోత్సవం



**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణంలోని బూరుగులమ్మ గ్రామదేవత దేవాలయంలో ఈ నెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు మహాకుంభాభిషేక మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అర్చకస్వామి ఎన్.భానుసుధాకర్ తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ దేవాలయంలో 12 సంవత్సరాలకోసారి మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.శాస్త్రోక్తంగా విశేష పూజలు,హోమాలు, అభిషేకాలు,అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

# ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేయరాదు

**నిజాంపట్నం, మార్చి 18, ప్రభాతవార్త:** ప్రశాంతంగా ఉన్న రేపల్లె నియోజకవర్గంలో అలజడులు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే సరైన సమయంలో తగిన బుద్ది చెప్పారని జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో



ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపల్లెలో ఫ్లెక్సీల విషయంలో ఏర్పడిన వివాదాన్ని మున్సిపల్ అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవాల్సి ఉండగా తెదేపా నాయకుల ఫ్లెక్సీలు చింపటం దారుణమనా న్నరు. ప్రజలు అన్నీ చూస్తూ ఉంటారని ఎవరేంటో తెలుసుకుంటారనా న్నరు. రేపల్లె నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆయన సోదరుడు శివప్రసాద్ అహర్నిశలూ కృషి చేస్తున్నారని ఆయన తెలియజేశారు. అధిక నిధులు తీసుకువస్తూ పనులు చేయిస్తున్నారన్నారు. వైకాపా నాయకులు రౌడీయిజానికి నాంది పలుకుతున్నారని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో నిజాంపట్నం పిఎసిఎస్ అధ్యక్షుడు మైలా నరేష్ , తెదేపా నాయకులు ఖాదర్‌బాబు, నక్కల పోలిరాజు, నర్రా వెంకటేశ్వరరావు, సునీల్, కేసన మోహనరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు వైకాపా రంజాన్ తోఫా అందజేత

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ ఆదేశాల ప్రకారం స్థానిక వైకాపా నాయకుల బృందం బుధవారం రేపల్లె టౌన్,మండలంలోని బేతపూడి మసీదుల పరిధిలోని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేశారు.



లడ్డూలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖుద్దూష్,ఖాదర్, భాషా,షేక్ సలీం,గోరా,హుదూద్,కాలేషా,డాక్టర్ అతిక్,షేక్ గౌస్,వైకాపా రేపల్లె పట్టణ కన్వీనర్ కె.శేషగిరిరావు,వైకాపా రాష్ట్ర సహాయ కార్యదర్శులు చిమటా బాలాజీ,చిత్రాల ఒబేదు,రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కె.వెంకటకృష్ణారెడ్డి,జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ప్రభు కిరణ్,దాసరి సందీప్,సాగర్,ఆలూరు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : జిల్లా కలెక్టర్

**బాపట్ల, మార్చి 18, ప్రభాతవార్త:** జిల్లాలో గృహ నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్ నుంచి



డి.పి.ఓ, హౌసింగ్ పి.డిలతో కలిసి గృహ నిర్మాణాలు, యూనిఫైడ్ సర్వే, వాట్సాప్ సేవలు, ఆస్తి పన్ను వసూళ్లపై ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**మహిళా సంఘాల ద్వారా రుణాలు**

గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గృహాలతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయం కల్పించడం ద్వారా పనుల్లో పురోగతి సాధించవచ్చని తెలిపారు. జిల్లాలో సుమారు 7,419 మంది మహిళలకు సంఘాల ద్వారా రుణాలు అందేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ పి.డిని ఆదేశించారు.

**వాట్సాప్ సేవల వినియోగంలో టాప్3లో ఉండాలన్నారు.**

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసే వాట్సాప్ సర్వీసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సేవల వినియోగంలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉండాలన్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాట్సాప్ సేవలపై పోస్టర్లు ప్రదర్శించాలనీ సూచించారు.

**యూనిఫైడ్ సర్వే:** ప్రతి మండలం పరిధిలో రోజుకు కనీసం 1,000 కుటుంబాల సర్వే పూర్తి చేయాలన్నారు.

ఆస్తి, ఇంటి పన్నుల వసూళ్లపై పట్టు వదలకూడదని, ప్రతి మండలంలో రోజుకు రూ. 4 లక్షల వసూలే లక్ష్యంగా పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎల్. ప్రభాకర్ రావు, హౌసింగ్ పి.డి వెంకటేశ్వరరావు, డి.ఆర్.డి.ఏ పీడీ విజయలక్ష్మి, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** ప్రపంచంలోని ముస్లింలంతా రంజాన్ ఉపవాసంతో అల్లాను తెల్లవారుజామున 4 గంటలకు ఆరాధించే ముస్లిం సోదరులు భోజనం చేసి దీక్షను ప్రారంభించి అభినందనీయులని అనగాని నీరు కూడా తాగకుండా సాయంత్రం అభిమాన సంఘం నేత కొండపల్లి 4 గంటల వరకు దీక్ష కొనసా



వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పురపాలక సంఘంలోని ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్‌ల సూచన ప్రకారం ముస్లిం మహిళలకు చీరలు ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు.రంజాన్ అనేది అరబిక్ భాషలో 9వ నెల అయిన మార్చిలో ఖరాన్ ఆవిర్భవించింద న్నారు. రంజాన్ మాసం వచ్చిందంటే గించడం విశేషమన్నారు.పేద ప్రజలకు దానధర్మాలు చేయడం వలన పుణ్యం ప్రాప్తిస్తుందని వెంకటేశ్వరరావు తెలిపారు.ఉత్తమ భావనలతో అల్లాను ఆరాధించడంతో మనసు ప్రశాంతత,ఉపవాసాల వలన ఆరోగ్యం చేకూరుతుందని ముస్లింలు విశ్వసిస్తుంటారని ఆయన చెప్పారు.సకల జీవరాశి ఎటువంటి సమస్యలు లేకుండా ఉల్లాసంగా ఉండాలని ముస్లిం సోదరులు ప్రార్ధనలు చేయడం అభినంద నీయమన్నారు.ఈ కార్యక్రమంలో షేక్ కరీముల్లా,కాగిత శ్రీనివాసరావు,నల్లూరు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**రేపల్లె,మార్చి 18, ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ





మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్ చెప్పారు.బుధవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అనగాని శివప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తయారు చేసే వంటశాల పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు.మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ బాధ్యాతయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.విద్యార్థులకు పోషక విలువలు అందేలా ఆహారాన్ని వండాలన్నారు.విద్యార్థులతో పాటు అనగాని శివప్రసాద్ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రం,డొక్కు శ్రీనివాసరావు,దేవగిరి రవిశంకర్,పంతాని సాయికుమార్,కొలసాని రాము తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో తగిన సేవలను అందించాలి

## జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల

**చెరుకుపల్లి, మార్చి 18, ప్రభాతవార్త :** ఆర్ఎస్కే కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రతి సర్వీసును నిబంధనల ప్రకారం రైతులకు సకాలంలో అందించాలని జిల్లా వ్యవసాయ అధికారిణని ఎం విజయనిర్మల అన్నారు. రాష్ట్ర మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో పప్పు ధాన్యాల కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు ఎఫ్ఏ క్యూ మరియు కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరంబాక ఆర్ఎస్కే లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మార్క్ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కరుణశ్రీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ రైతులు ఈసి ఎం ఎ పి పి పోర్టల్



ద్వారా మరియు ఆధార్ లింకుతో నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు సరిగ్గా పని చేసే విధంగా చూసుకోవాలన్నారు. రైతుల వద్ద నుంచి సేకరించే అపరాలు సెనగకు 14 కంది, మినుము ,పెసలకు 12 శాతం వరకు అనుమతించాలని సిబ్బందికి సూచించారు. రైతుల వద్ద నుండి అపరాలకు కొన్న వెంటనే తగిన రసీదు అందజేయాలన్నారు. రైతులకు నగదు చెల్లింపులు బ్యాంకు ఖాతాలకుదీతీగి ద్వారా సమయానికి జమ చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో శుభ్రత ,నిల్వ, భద్రతా చర్యలు పాటించాలన్నారు. అపరాలు కొనుగోలు తాలూకు స్టాక్ రిజిస్టర్ ,వివరాలను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలి అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రయోజనం సక్రమంగా అందేలా కేంద్రాలు పని చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు తగిన సేవలు అందించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శిక్షణ కార్యక్రమంలో రేపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ మత్తి అనురాధ భాస్కరరావు, ఏ డి ఏ లక్ష్మీ ,, ఏవో ఫరూక్, కావూరు గూడవల్లి పిఎసిఎస్ చైర్మన్లు మండవ తాతాజీ, సురేంద్రబాబు, సనకా శ్రీనివాసరావు, రవి కిరణ్, సంఘాల సీఈఓ లు, సాంకేతిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల జీవితం షడ్రుచుల సమ్మేళనం

## జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

**బాపట్ల, మార్చి 18, ప్రభాతవార్త:** తెలుగు నూతన సంవత్సరం శ్రీ పరాభవశ్రీ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని బాపట్ల జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి మరియు మీడియా మిత్రులకు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రతి ఇంటా సుఖ శాంతులు, సిరిసం పదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.విధుల పట్ల అంకితభావం అభినంద నీయంఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగ వేళల్లో తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ,



ప్రజల రక్షణే ధ్యేయంగా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. "తీపి, పులుపు, చేదు వంటి షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి లాగే పోలీసుల జీవితం కూడా ఉంటుం అన్నారు.పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులు ఎదురైనా.. వాటన్నింటినీ ధైర్యంగా, సమయస్ఫూర్తితో అధిగమించినప్పుడే నిజమైన విజయం లభిస్తుందన్నారు.శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలిసమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తూ, పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆనందోత్సాహాల మధ్య శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ప్రజలను ఎస్పీ కోరారు.

# నేడు మున్సిపల్ పాలకవర్గానికి సత్కారం

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రేపల్లె పురపాలక సంఘంలో ఐదు సంవత్సరాలు ప్రజాసేవ చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్లు,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులను గురువారం ఉదయం 10 గంటలకు సన్మానిస్తామని ప్రముఖ వ్యాపారవేత్త,రాజకీయవేత్త మోపిదేవి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం పూర్తయిన సందర్భంగా వారి సేవలకు గుర్తింపుగా ఉగాది,రంజాన్ పర్వదినాల సందర్భంగా అభినందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# అక్రమ మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవు

**నగరం, మార్చి 18, ప్రభాతవార్త:** అక్రమ మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం పాలసీ అమల్లోకి వచ్చినప్పటి నుండి నగరం, చెరుకుపల్లి ,నిజాంపట్నం మండలాల్లో సుమారు 151 కేసును నమోదు చేసామని తెలిపారు. 3 మండలాల్లో 79 కేసులు నమోదు చేసి 79 మందిని అరెస్టు చేసి 685 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిజాంపట్నం మండలంలో మూడు డిఫెన్స్ లిక్కర్ కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి 30 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని, నిజాంపట్నం మండలంలో నాటు సారా ప్రభావిత ప్రాంతాల్లో ఆరు లిక్కర్ కేసు నమోదు చేసి,36.5 లీటర్ల లిక్కర్ న స్వాధీనం చేసుకుని , ఆరుగురుకి రిమాండ్ పంపించామని, నాటు సారా తయారీకి ఉపయోగించే 92000 లీటర్ల బెల్లం ఊటని ధ్వంసం చేయడమైనదని, నాటు సారా అరికట్టేందుకు నిజాంపట్నం మండలంలో అనుమానిత ప్రదేశాల్లో నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. కల్తీ కల్లు నివారించుటకు103 కల్లు శాంపిల్స్ తీసి రసాయన పరీక్షలు పంపించడం జరిగిందని, కల్తీ మద్యం అమ్మకాలు నివారించుటకు 45 మద్యం దుకాణాల నుండి శాంపిల్స్ తీసి రసాయన పరీక్ష పంపించడం జరిగిందని తెలిపారు.74 మందిని 128/129 బి ఎన్ ఎస్ ఎస్ చేయడం జరిగింది అన్నారు.

# జవహర్ నవోదయకు భట్టిప్రోలు విద్యార్థులు

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 18, ప్రభాతవార్త :** భట్టిప్రోలుకు చెందిన ఇరువురు విద్యార్థులు జవహర్ నవోదయ పరీక్షలలో అద్భుత ప్రతిభను చూపారు.జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో భట్టిప్రోలు రామారావు ఎంపిపి పాఠశాల విద్యార్థిని దీపాల నాగిని సాయి 100 మార్కులకు 87.5 మార్కులు సాధించి 82వ ర్యాంకును కైవసం చేసుకుంది.భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థి మోకా హర్షిత్ 100 మార్కులకు 83.75 మార్కులు సాధించి 169 ర్యాంకును కైవసం చేసుకున్నాడు.ఉత్తమ ర్యాంకులు సాధించిన నాగిని సాయి,హర్షిత్‌లను ప్రధానోపాధ్యాయుడు షేక్ హుస్సేన్,కరస్పాండెంట్ ఎంపి వెంకట్రావు,ఉపాధ్యాయులు అభినందించారు.



## దివ్యాంగుల ఉచిత బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దివ్యాంగుల ఆత్మనిబ్బరతకు దివ్యాంగశక్తి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆర్టీసీ బస్సుకు పూజలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణిస్తున్న దివ్యాంగులకు కండెక్టర్‌తో టికెట్ కొట్టించి అందజేశారు. మాచర్ల నుంచి వెల్దుర్తి వరకు బస్సులో ప్రయాణించారు. గతేడాది అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ఇంద్రధనస్సు పేరిట దివ్యాంగులకు ఆరు పథకాలను ప్రకటించాలని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకాన్ని అమలు చేసి, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**నరసరావుపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త :** దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం



ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి పథకంను బుధవారం నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ బి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ రవికుమార్, పట్టణ ప్రముఖులు కపిల విజయ్ కుమార్, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కర్ణాటి కృష్ణమూర్తి, ఆర్టీసీ అధికారులు ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రతే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వును చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఎప్పుడూ దివ్యాంగుల వెంటే ఉంటుందని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే అరవింద్ బాబు ఉచిత ప్రయాణ పాసులను దివ్యాంగులకు అందజేసి వారితో కలిసి రావిపాడు గ్రామం వరకు ప్రయాణించారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినుకొండలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన జీవీ

**వినుకొండ, మార్చి18, ప్రభాతవార్త:** దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన దివ్యాంగ శక్తి కార్యక్రమానికి జీ.వీ ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారంలోకి రాగానే 3000 రూపాయలుగా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 6,000కు పెంచడం, పూర్తిస్థాయి వైకల్యంతో బాధపడుతున్నవారికి నెలకు రూ. 15,000 పెన్షన్ అందించడం గొప్ప విషయమన్నారు. వైద్య సేవలు, ఉద్యోగాలు, ఇతర అవసరాల కోసం సులభంగా, ఉచితంగా రాకపోకలు కల్పించడం వంటి చర్యలు దివ్యాంగుల





ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా, ఇప్పటివరకు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చే విధంగా కృషి చేస్తుందన్నారు. ఉగాది కానుకగా ప్రారంభమైన దివ్యాంగ శక్తి పథకం ద్వారా సుమారు 12.76 లక్షల మంది దివ్యాంగులు వారి సహాయకులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించగలుగుతారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ ప్రయాణానికి రూ. 207 కోట్ల సబ్సిడీ భారం ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం స్వావలంభనకు దోహదపడతా యన్నారు. అనంతరం జీవి దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి దివ్యాంగులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. చీఫ్‌విప్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ

**బొల్లాపల్లి, మార్చి18, ప్రభాతవార్త:** మండలంలో వెల్లటూరు గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు పాల్గొన్నారు. స్వయంగా గ్రామంలో ఇంటింటి



ప్రచారం నిర్వహించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు పంటలను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల గురించి రైతులకు వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య

**మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త:** ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాచర్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మాచర్ల పట్టణానికి చెందిన కామనబోయిన చౌడమ్మ, జమ్మలమడక గ్రామానికి చెందిన గంగనబోయిన నాగరాజుతో ప్రేమలో ఉన్నట్లు సమాచారం. పెద్దలు అంగీకరించరనే భయంతో ఇద్దరూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. చౌడమ్మ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించడం లేదని ఆరోపిస్తూ వారం రోజుల క్రితం తల్లిదండ్రులు పోలీసు స్టేషన్ ముందు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడికి చేరుకున్న డీఎస్పీ, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అమ్మాయిని తీసుకువస్తామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి



నుంచి వెళ్లిపోయారు. నాలుగు రోజులక్రితం పోలీసులు పోలీసులు చౌడమ్మను స్టేషన్‌కు తీసుకువచ్చి పెద్దల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమించిన వ్యక్తి దూరమవడంతో మనస్తాపానికి గురైన చౌడమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మాచర్లలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మాచర్లలో కార్డెన్ సెర్చ్

**మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త:** స్థానిక రోప్‌లైన్ కాలనీ, 8వ వార్డులో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్డెన్ సెర్చ్‌లో అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను, వస్తువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 33 మోటారు సైకిళ్లు, రెండు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గడ్డపారలు, గొడ్డళ్లు వంటి



ప్రమాదకర వస్తువులను గుర్తించారు. కాలనీలో పలు ఇళ్లను సోదా చేసి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. అనంతరం స్థానికులకు గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్డెన్ సెర్చ్‌లో కారంపూడి సీఐ శరత్‌బాబు, ఎస్సై సంధ్యారాణి, టౌన్ ఎస్సై వెంకట్రావు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న 16 మంది అరెస్టు

### రూ.3.40 లక్షలు స్వాధీనం

**నరసరావుపేట క్రైమ్, మార్చి 18, ప్రభాతవార్త :** రొంపిచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల కర్లకుంట గ్రామాల మధ్య గల మొక్కజొన్న పొలాలలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు బుధవారం తెల్లవారు జాము సమయంలో దాడులు నిర్వహించినట్లు రొంపిచర్ల ఎస్ఐ ఎల్.లోకేశ్వరరావు తెలిపారు. దాడులలో పేకాట ఆడుచున్న 16 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 3,40,100 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది. రొంపిచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వుల మేరకు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లోకేశ్వరరావు హెచ్చరించారు . చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై సమాచారం అందించే వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

## రైతులు సంక్షేమానికి ఉమ్మడి కూటమి ప్రభుత్వం పెద్ద పీట : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మార్చి 18 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం పమిడిపాడు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా



గ్రామంలో ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన"రైతన్న మీకోసం మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. ప్రజలతో మమేకమై, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రైతులు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నా రు. ఎక్కడా లేని విధంగా సంవత్సరం 20,000 రూపాయలు ఆర్థిక సాయం ప్రతి రైతుకి అందుతున్నాయని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతన్న ని ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఎప్పుడు మర్చిపోలేదన్నారు. వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని ఆర్టికల్చర్ సెర్రీ కల్చర్, సేంద్రీయ వ్యవసాయం అవగాహన సబ్సిడీ పైన పనిముట్లు. ట్రాక్టర్లు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పశువైద్యశాఖ ఏడి, వైద్య సిబ్బంది, అగ్రికల్చర్ అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు కపల విజయకుమార్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పునాటి శ్రీనివాసరావు, ఉమ్మడి కూటమి నాయకులు, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కిల్కారి సేవలు పైన అవగాహన

**యడ్లపాడు, మార్చి 18, ప్రభాతవార్త :** యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో జరుగుతున్న ఇమ్యూనైజషన్ సెషన్ ని కిల్కారి రీజినల్



ప్రోగ్రాం ఆఫీసర్ రాజు బుధవారం సందర్శించారు. గర్భిణీ, బాలింతలకు కిల్కారి కాల్స్ పైన అవగాహన కల్పించడం జరిగినది. మాతా శిశు మరణాలు తగ్గించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కిల్కారి సేవలను గర్భిణీ, బాలింతలకు ప్రవేశ పెట్టారు. ఈ కిల్కారి కాల్ ద్వారా తల్లీ మరియు బిడ్డల యొక్క ఆరోగ్య సమాచారం అందిచబడుతుంది. ఈ కిల్కారి కాల్స్ గర్బిణీ 4వ నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు వస్తాయన్నారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ నెలకు ఒక సారి గర్బిణీ, బాలింతల యొక్క మొబైల్స్‌కి వస్తాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 911600403660 అని, ఈ కాల్ నెంబర్ ని గర్భిణీలు మరియు బాలింతలు వాళ్ళ మొబైల్ లో సేవ్ చేసుకున్నట్లు అయితే కాల్ వచ్చినపుడు తీసి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారన్నారు. ఒక వేళ మరలా తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి చేసి వినవచ్చునాన్నరు. ఈ విధంగా సరైన సమయం సరైన సమాచారాన్ని విని పాటించటం ద్వారా తల్లీ బిడ్డలు ఆరోగ్యం గా ఉంటారు. ఈ కిల్కారి సేవలను గర్బిణీలు, బాలింతలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో శివనాగ లక్ష్మి, ఎఎన్ఎమ్ విజయకుమారి మరియు ఆషాలు సామ్రాజ్యం, మస్తానీ పాల్గొన్నారు.

## నవోదయ సీటు సాధించిన పమిడిమర్రు విద్యార్థిని

**నరసరావుపేట, మార్చి 18 ప్రభాతవార్త :** నరసరావుపేట మండలంలో ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నవోదయాలో సీటు సాధించారు. వివరాలను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరెడ్డి తెలియజేశారు. పమిడిమర్రు ఎస్.సి.కాలని ప్రాథమిక పాఠశాల నుండి గర్నెపూడి హదస 202627 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల నందు సీటు సాధించినదన్నారు. ఈ సందర్భంగా గర్నెపూడి హదసను ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అభినందించారు. అదేవిధంగా పాఠశాల



హెచ్.యం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి మండల విద్యాశాఖాధికారి వారిని స్థానిక మండల వనరుల కేంద్రంలో కలవటం జరిగినది. యం.ఇ.ఓ వి.ఏసుబాబు సీటు సాధించిన హదసను, పాఠశాల ఉపాధ్యాయులను, సిబ్బందిని మరియు తల్లిదండ్రులను అభినందించారు.

## నవోదయ ఫలితాల్లో శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్ విజయదుందుభి

**వినుకొండ, మార్చి18, ప్రభాతవార్త:** నవోదయ ఫలితాల్లో పట్టణంలోని శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మొత్తం సీట్లు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్లు కావూరి సాయికుమార్, బ్రహ్మయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు ఎస్.రాజకుమార్, కె.నరసింహ, ఎం.శైవిజ్ఞా, ఎస్.లిఖిత, కె.అశ్విత్, ఎం.అంజిని, శ్రీనివాస్, డి.సుదర్శన్, జె.అశ్రిత, జి.హర్షవర్ధన్‌లకు అభినందనలు తెలియజేశారు.




## పదవులు19 మంది జనసైనికులకే దక్కాయి

**నరసరావుపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ లబ్ధిదారులు అంటూ ఇటీవల నియోజకవర్గ టీడీపి నాయకులు విడుదల చేసిన 50 మంది పదవులు పొందిన లబ్ధిదారులలో కేవలం 19 మంది మాత్రమే జనసేన పార్టీ వారని అధికార ప్రతినిధి షేక్. అద్రుఫ్ అన్నారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. అందులోని మిగతా లబ్ధిదారులు టీడీపి, బిజెపి, వైసిపిలకు చెందిన నాయకులా, లేక ప్రజా సంఘాల నాయకులో టీడీపి వారే సమాధానం చెప్పాలన్నారు. నరసరావుపేట



నియోజకవర్గంలో రేషన్ డీలర్స్, వివిధ ప్రభుత్వ సంస్థల్లో డైరెక్టర్, యానిమేటర్స్ తదితర 1607 పోస్టులు ఉంటే, జనసేన పార్టీ శ్రేణులకు కేవలం 19 పోస్టులు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు జనసేన పార్టీ కార్యకర్తలకు ఎటువంటి న్యాయము జరగలేదని అన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులను కల్పించాలని ఎమ్మెల్యే ని కోరుకుంటున్నామని కోరారు. సమావేశంలో నాయకులు మల్లెపూల దుర్గాకుమారి, ఆర్కే. యాదవ్, కృష్ణంశెట్టి ఏడుకొండలు, చెన్నుపల్లి సాంబ, షేక్. బాషా, జడా శ్రావణి, రేణుక, నిర్మల పాల్గొన్నారు.

## వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**సత్తెనపల్లి మార్చి 18 ప్రభాతవార్త:** పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం బుధవారం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకొని ఆలయ శుద్ధి చేపట్టారు. వేకువఝుమున సుప్రభాతం, అర్చన సేవల అనంతరం శ్రీవారి మూల మూర్తికి



ఆలయ ప్రధాన అర్చకులైన శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ స్వామి పట్టు వస్త్రంతో పూర్తిగా కప్పివేశారు. సుగంధ ద్రావ్యాలు కలిపిన ప్రవిత్ర జలంతో ప్రదీక్షణగా వెళ్లి.. ఆలయ శుద్ధి చేపట్టారు. ఆలయ శుద్ధి అనంతరం స్వామి వారిపై కప్పిన వస్త్రం తొలగించి, ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజన కార్యక్రమానికి, నారాయణసేన నగర సంకీర్తన బృందం, కోలాట మహిళ భక్త బృందం, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. అర్చకులు వారికీ శ్రీవారి మంగళశాసనలు అందజేశారు.

## రైతన్నా మీ కోసం ఇంటింటి ప్రచారం

**నూజెండ్ల, మార్చి18, ప్రభాతవార్త:** రైతన్నా మీ కోసం వారోత్సవాల్లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలతో పాటు ఐదు ముఖ్య సూత్రాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ప్రచార పత్రికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజనేయులునాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## అచ్చంపేట పీహెచ్‌సీలో 3గ్గురు ఆశా కార్యకర్తలకు నియామక పత్రాల అందజేత

**అచ్చంపేట, మార్చి 18, (ప్రభాతవార్త):** అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టులకు నియామక పత్రాలు బుధవారం అందజేశారు. అచ్చంపేట1, పెదపాలెం, కోగంటివారి పాలెం సబ్ సెంటర్లకు చెందిన ముగ్గురు అభ్యర్థులకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. రవి మంజూరు చేసిన నియామక పత్రాలను పీహెచ్‌సీ వైద్యాధికారి డా. వి. రాంబాబు నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట1 సబ్ సెంటర్‌కు సందెపోగు ఇందిర, పెదపాలెం సబ్ సెంటర్‌కు సుంకర ఆదిలక్ష్మి, కోగంటివారి పాలెం సబ్ సెంటర్‌కు గడ్డం శ్రీలక్ష్మి నియామక పత్రాలు పొందారు. కొత్తగా నియమితులైన ఆశా కార్యకర్తలు



తమకు కేటాయించిన గ్రామాల్లో సుమారు వెయ్యి మంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో మాతాశిశు సంరక్షణ సేవలు, ఆరోగ్య కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించాలని వైద్యాధికారి డా. వి. రాంబాబు నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి. వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ కె. పార్వతి, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీ న్యాయవాదుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

వినుకొండ, మార్చి18, ప్రభాతవార్త: రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం మైనార్టీ న్యాయవాదుల ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనం నందు ఇఫ్తార్ విందు



కార్యక్రమం ఏర్పాటు చేశారు. వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి కార్యక్రమంలో పాల్గొని అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీసాల శ్రీనివాసరావు, సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దిన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ పివి రమణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎన్ శేఖర్ బాబు, ట్రెజరర్ వి శివశంకర్ బాబు, ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు, ఏపీపీ దండే వెంకటేశ్వర్లు, సయ్యద్ ఖాసిం, సిహెచ్ అస్మతుల్లా, జే ఎస్ కే నాగూర్, ఎస్ అబ్దుల్ హఫీస్, సీనియర్ న్యాయవాదులు పి జే లుకా, సిహెచ్ వెంకీ రెడ్డి, ఎన్ రామకోటేశ్వరరావు, పి సైదారావు, టి హనుమంతరావు, మూర్తి, ఎంఎన్ ప్రసాద్, సి వీరాంజనేయులు, ఎమ్ సామ్రాజ్యం, నాగ పద్మ, మాధవి తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, గుమస్తాలు పాల్గొన్నారు.

## నేడు పునీత జోజప్ప పండుగ

**పెదకూరపాడు, మార్చి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జలాలపురం గ్రామంలో గురువారం పునీత జోజప్ప తిరుణాల మహోత్సవం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు వారన్నారు. క్రైస్తవ భక్తులు పునీత జోజప్ప పండుగ మహోత్సవంలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరారు.



## స్పోర్ట్స్ మీట్‌లో ఎంఏఎం విద్యార్థినుల ప్రతిభ

**నకరికల్లు, మార్చి 18 ప్రభాతవార్త :** మలినేని లక్ష్మయ్యఇంజనీరింగ్ కాలేజ్ లో ఈనెల 13,.14 తేదీలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్లో ఎం ఏ కళాశాల విద్యార్థినిలు మంచి ప్రతిభ చూపారు. మలినేని విద్యాసంస్థలలో నిర్వహించినటువంటి సంస్కృతి ఏ నేషనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్లో కేసనుపల్లి మేదరమెట్ల అంజమ్మ మస్తాన్ రావు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రాణించారు. టెన్నికాయిట్ విభాగంలో సెకండ్ ప్లేస్ సాధించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృథ్విరాజ్ గారు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రామ శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణిస్తున్నారని విద్యార్థులును అభినందించారు ఎస్. గౌరీ బి. శిరీష ను, ఫిజికల్ డైరెక్టర్ కె. సన్నీ డేనియల్ ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు అధ్యాపకులు అధ్యాపక సిబ్బంది అభినందించారు.



# దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషి

## దివ్యాంగ శక్తి పథకం లబ్ధిదారులతో ఆత్మీయ విందులో మంత్రి నారా లోకేష్

**మంగళగిరి, మార్చి 18, ప్రభాతవార్త :** దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలో సీఎం చంద్రబాబునాయుడు , డిప్యూటీ సీఎం పవన్



కల్యాణ్ తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించారు. మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్ ప్రయాణించారు. అనంతరం ఉండవల్లి నివాసంలో దివ్యాంగ శక్తి పథకం లబ్ధిదారులతో జరిగిన ఆత్మీయ విందు సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించిన మంత్రి లోకేష్.. తన పక్కన కూర్చొన్న శివనాగరాజు, సౌభాగ్య, ఖాశింబి, అన్నపూర్ణమ్మలతో మమేకమై మాటామంతీ కలిపారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల గౌరవం పెంచాలి. వారిలో పట్టుదల ఎక్కువ. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చు. వికలాంగుల ఆత్మ గౌరవం ముఖ్యం. సమాజంలో కూడా మహిళలను కించపరిచే పదాలను



అందరూ విడనాడాలి. ఇందుకోసం నేను పోరాడుతున్నాఅన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతోంది. స్త్రీలు ఎవరిపై ఆధారపడకూడదు. ఇంటర్ తర్వాత అమెరికా వెళ్లడం నా లైఫ్ లో బెస్ట్ డెసిషన్. నా సొంత కాళ్లపై నిలబడగలిగాను. దాదాపు 8 ఏళ్లు నేను యూఎస్ లో ఉన్నాను. చదువుతో పాటు ఉద్యోగం చేశాను. దీంతో అవగాహన వచ్చిందనీ చెప్పారు. దివ్యాంగుల యోగక్షేమాలను, ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిని ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ అందుకున్న తర్వాత ఐవీఆర్ఎస్ కాల్స్, సీఎం సందేశం వస్తున్నాయా అని వాకబు చేశారు. తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వంలో అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేష్ వారికి హామీ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యేలు మాధవి,నసీర్

**గుంటూరు మార్చి 18, ప్రభాతవార్త :** గుంటూరు బస్ స్టాండ్ వద్ద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించే "దివ్యాంగ శక్తి" పథకాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు,





తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ గారు పచ్చజెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఎంతో స్వాగతించదగ్గ విషయమని, టీడీపీ ప్రభుత్వం ఎప్పటి నుంచో బడుగు బలహీన వర్గాల సంక్షేమం, సాధికారత కోసం కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 12 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వారి ఆత్మగౌరవం మరియు స్వేచ్ఛాయుత జీవనం కోసం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా "ఇంద్రధనస్సు" పేరిట ఏడు సంక్షేమ పథకాలను ప్రకటించారని తెలిపారు. ఆ హామీల్లో భాగంగానే కేవలం రెండు మూడు నెలల్లోనే "దివ్యాంగ శక్తి" పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఇవ్వడం, స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలతో దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పథకం కోసం అదనంగా రూ. 207 కోట్ల నిధులు కేటాయించడం ద్వారా దివ్యాంగులు స్వతంత్రంగా ముందుకు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఇప్పటికే "స్త్రీ శక్తి" పథకం కింద మహిళలకు లభిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని, ఇప్పుడు దివ్యాంగులకు విస్తరించడం ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు బస్సులో ప్రయాణించి దివ్యాంగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బస్సుల్లో ఎక్కేటప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఫుట్ స్టెప్స్‌ను మరింత సౌకర్యవంతంగా మార్చాలని వారు కోరగా, ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలో నడిచే సుమారు 40 సర్వీసుల్లో ఈ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్య, ఉపాధి, దైనందిన జీవితంలో స్వేచ్ఛగా ముందుకు సాగాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు స్పష్టం చేశారు.

# డ్రైన్‌ను క్రాస్ చేసి ఇంటికి తాగునీరు అందే ప్రతి పైపులైన్లు మార్చుకోవాల్సిందే

-తక్షణమే మార్చుకునేలా ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలి

-యజమానులు స్పందించని ఇళ్లకు ఉన్న కుళాయి కనెక్షన్లు కట్ చేయండి

నగర కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 18 ( ప్రభాతవార్త ) : తాగునీరు కలుషితం జరిగితే ప్రజలకు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని డ్రైన్లను క్రాస్ చేసే ప్రతి ఇంటికి ఉన్న కుళాయి కనెక్షన్లను తక్షణమే మార్చుకునేందుకు ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆ ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ కె మయూర్ అశోక్ ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు నగరంలోని ప్రతి సచివాలయాల వారీగా వార్డులలో ఉన్న ఇటువంటి కుళాయి కనెక్షన్లను



గుర్తించి నోటీసులు అందించాలని సూచించారు. మురుగునీటి కాలువల మీదగా ఇళ్లల్లోకి వెళ్లే కుళాయి కనెక్షన్లను షిఫ్ట్ చేసుకునేందుకు స్పందించని యజమానులకు చెందిన ఆ ఇంటి కుళాయి కనెక్షన్‌ను వెంటనే డిస్కనెక్ట్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీటితోపాటు చర్యలు తీసుకోవాలని, పనులు పూర్తయ్యాక స్థానికంగా ఉన్న ప్రజలు, లేదంటే కమిటీలకు చెందిన వారి నుంచి సంతకాలు సేకరించాలన్నారు. తాగునీటి సరఫరా సమయంలో ప్రతి ఎనిమిటి కచ్చితంగా 10 శాంపిల్స్ తీసి ఏపీ సీఎంఎం యాప్ లో అప్లోడ్ చేయాలని, అలానే ప్రతి ఏ ఈ క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా సమయంలో పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఫస్ట్ పేజ్ గా గుర్తించిన బిల్లులను అగ్రిమెంట్ స్టేజి, టెక్నికల్ శాంక్షన్, అగ్రిమెంట్, డిజిటల్ ఎం బుక్ లు పూర్తిచేసి శనివారం లోపు నిధి పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వార్డుల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. ఎక్కడైనా కాంట్రాక్టర్లు అసంపూర్తిగా చేసి, పనులు నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సూచించారు. పనులు పూర్తయ్యాక వేస్ట్ మెటీరియల్ అంతా కాంట్రాక్టర్లు తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ ఈ జీ వెంకటేశ్వరరావు, ఈఈలు వేణు, విష్ణు, డిఈలు, ఏఈలు, ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితురాలికి అండగా నిలిచిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

-ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10లక్షలు మంజూరు

పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త: పురపాలక సంఘ పరిధిలోని నిడుబ్రోలు గ్రామానికి చెందిన వీరమాచినేని రమ్యశ్రీ క్యాన్సర్



వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అసవరమైన నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను కలిశారు. విషయాన్ని తెలుసుకొన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 10లక్షలు మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన పత్రాలను రమ్యశ్రీ భర్త అవినాష్‌కు స్థానిక టిడిపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాగర్లమూడి సుధీర్, టి. లక్ష్మీనారాయణచౌదరి, అలపర్తి చంద్రమోహన్, సాయికృష్ణ, సుభాష్ వర్మ తదితరులున్నారు.

# దివ్యాంగ శక్తి పథకం ప్రారంభోత్సవానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

**మంగళగిరి, మార్చి 18, ప్రభాతవార్త :** దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "దివ్యాంగ శక్తి పథకం ప్రారంభోత్సవం సందర్భంగా మంగళగిరిలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్,



చేతుల మీదుగా మంగళగిరి బస్టాండ్ వద్ద ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవాది కిరణ్ చంద్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మంగళగిరి వైపు తరలివస్తున్నారు. పార్టీ జెండాలు ఎగురవేస్తూ, నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. మార్గమధ్యంలో ప్రజలు స్వాగతం పలుకుతూ మద్దతు తెలియజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. దివ్యాంగులకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్,ఎమ్మెల్యేలు,కూటమి నాయకులు

**నరసరావుపేట, మార్చి 18 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో గురువారం ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందును కూటమి నేతలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా హాజరయ్యారు. ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందును స్వయంగా వడ్డించి వారు ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, భాష్యం ప్రవీణ్, కూటమి నాయకులు నల్లపాటి రాము, షేక్ మీరావలి, నాగసరపు సుబ్బరాయ గుప్త, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు. రంజాన్ మాసంలో ఎంతో కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా అల్లా దయతో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ అందుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం మంచి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రత్యేకంగా ముస్లిం సోదరులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పథకాలను వారు వివరించారు. మత పెద్దలు రంజాన్ మాసం ప్రత్యేకతను తెలియజేశారు. నియోజకవర్గంలోని వందల సంఖ్యలో మైనార్టీ సోదరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య

**వట్టిచెరుకూరు, మార్చి18, ప్రభాతవార్త :** తెలుగు పరీక్ష సక్రంగా రాయలేదనే మనస్థాపంతో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, నాగులవరం గ్రామానికి చెందిన మందల రామయ్య, లింగమ్మ దంపతుల మొదటి కుమారుడు మందల రాకేష్ (19) మండల కేంద్రంలోని ప్రభుత్వ బిసి బాలుర వసతీ గృహంలో ఉంటూ, ఈ విద్యా సంవత్సరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 16వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు హాజరైనాడు. ఆరోజు హాస్టల్లో తోటి విద్యార్థులతో కలిసి ఉంటూ ఆనందంగానే గడిపాడు. ఆరోజు రాత్రి విద్యార్థులందరూ భోజనం ముగించుకొని స్టడీ అనంతరం నిద్రకు ఉపక్రమించారు. మరుసటి రోజు 17వ తేదీ తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో నైట్ వాచ్మెన్ 10వ తరగతి విద్యార్థులను చదువుకునే నిమిత్తం నిద్రలేపారు. ఆ సమయంలో 10వ తరగతి విద్యార్థులందరూ ఉండగా వారిలో రాకేష్ కనిపించలేదు. తెల్లవారిన తర్వాత పరిసర ప్రాంతాలు, పాఠశాల ప్రాంగణం మొత్తం విద్యార్థులు రాకేష్ కోసం వెతుకులాడారు. ఎక్కడ ఆచూకీ తెలియ రాలేదు. వెంటనే వార్డెన్ పల్నాడు జిల్లాలో ఉన్న విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు కూడా మా బాబు ఇక్కడికి రాలేదని వార్డెన్ కి బదులు సమాధానం ఇచ్చారు. ఏం జరిగిందోనని కంగారుతో తల్లిదండ్రులు హుటాహుటిన బయలుదేరి వట్టిచెరుకూరు గ్రామానికి తరలివచ్చారు. ఈలోగా వార్డెన్ స్థానిక పోలీస్ స్టేషన్లో విద్యార్థి గురించి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం స్థానికులు అటుగా వెళుతూ ఉండగా విద్యార్థి మృతదేహం ఉబ్బి చెరువులో పైకితేలి కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి



తరలించారు. దీనితో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటన చూపరులను కన్నీరు తెప్పించింది. మొదటిరోజు జరిగిన తెలుగు పరీక్ష బాగా రాయలేదనే మనస్థాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. గత ఏడాది కూడా ఇదే హాస్టల్ కు చెందిన ఓ విద్యార్థి మంచినీటి కోసం చెరువులో దిగి కాలుజారి పడి మృతి చెందాడు. అప్పట్లో దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్థానిక సంక్షేమ అధికారిని సస్పెండ్ చేశారు. ఈ సంఘటన మరువక ముందే మరొక విద్యార్థి అదే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికంగా కలకలం రేపింది. దీనిపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వాతావరణం మార్పుతో రైతుల ఆందోళన

**కొల్లిపర,మార్చి 18, ప్రభాతవార్త:** మండలంలో బుధవారం వాతావరణంలో మార్పు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళనపడ్డారు. చిరు జల్లులతో కూడిన వర్షంకురిసింది. మండలంలోనిమున్నంవల్లపురం, పిడపర్రు, కొల్లిపర, పిడపర్తిపాలెం, చివలూరు, తూములూరు, అత్తోట, చక్రాయ పాలెం, దావులూరు, హనుమాన్‌పాలెం గ్రామాలలో పసుపు పంటను దున్ని వండి కల్లాల్లో ఆరబెట్టిన రైతులు



వర్షంతో ఎక్కడ నష్టపోవాల్సి వస్తుందోనని రైతులు ఆవేదన చెందారు. భారీగా వర్షం కురుస్తుందేమోనని భావించిన రైతులు పంట



దిగుబడులపై తడవకుండా పట్టాలు కప్పి జాగ్రత్తపడ్డారు. కొందరు రైతులైతే కల్లాల్లో ఎండబెట్టిన పసుపును గోతాలలో నింపుకుని ట్రాక్టర్ల ద్వారా గృహాలకు తరలించుకున్నారు. శనగ రైతులు తమ పంట దిగుబడులను గుట్టగా చేర్చి పట్టాలు కప్పి రక్షించుకున్నారు. ఇటుక పరిశ్రమ నిర్వాహకులు ఇటుకబట్టీలు తడవకుండా ప్లాస్టిక్ పట్టాలను కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. భారీ వర్షం కురవని కారణంగా రైతులు ఊపిరిపీల్చుకున్నారు. కొన్ని ప్రాంతాలలో గాలులు వీయడం వలన అరటి చెట్లు విరిగిపడ్డాయి. మొక్కజొన్న నేలవాలింది.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తు

**గుంటూరు క్రైమ్, మార్చి18,ప్రభాతవార్త:** మార్చి 16 నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు,సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తూ, కేంద్రాల సమీపంలో ఎవరూ గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు, పరీక్షలకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతరులు ఎవరూ ఉండకుండా పర్యవేక్షిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో పరీక్షలు ముగిసేంతవరకు జిరాక్స్/ప్రింటింగ్ సెంటర్లు మూసివేయించే విధంగా కూడా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలు కొనసాగుతున్నంతసేపు మొబైల్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. పరీక్షల సమయంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాలను డిపాజిట్ చేయుటకు పటిష్టమైన ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. పరీక్షలు పూర్తయ్యేవరకు ప్రతిరోజు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా, సాఫీగా జరగేందుకు పోలీస్ శాఖ తరఫున అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటునట్లు ఎస్పీ తెలిపారు

**ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ..**

గుంటూరు జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు శ్రీ పరాభవఖిఖి నామ ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది పండుగతోనే ఆరంభం అవుతుందని, ఉగాది పేరులోనే ఏడాది ప్రారంభమని అర్థం ఉందని తెలిపారు. ఉగాది మంచి ఆరోగ్యం, సంపద, ఆనందం, ఉల్లాసాన్ని ఇవ్వాలని, తలపెట్టే కార్యాలు నిర్విఘ్నంగా పూర్తికావాలని, ఎస్పీ ఆకాంక్షించారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరీ, సోదరీమణులందరూ సంతోషంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వెల్లడించారు. అల్లాహ్ దీవెనలతో జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని జిల్లాఎస్పీ పేర్కొన్నారు. ఈ ఉగాది, రంజాన్ పండుగలు గుంటూరు జిల్లా ప్రజల సమైక్యతకు, మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలన్నారు.

# నేడు పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో పంచాంగ శ్రవణం

**గుంటూరు, మార్చి 17, ప్రభాతవార్త :** పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా పెదకాకాని శ్రీ



మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం ఉదయం 7:00 గంటలకు గోపూజ మహోత్సవం, సాయంత్రం 4:30 నుండి ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి, తెనాలి వారిచే పంచాంగ శ్రవణం కార్యక్రమం జరుగునని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రావు తెలిపారు. ఉగాది పండగ రోజున 6 కేటగిరి దేవాలయం నందు పనిచేయుచున్న ఇరువురు అర్చకులకు, ఒక వేద పండితునికి ఉగాది పురస్కారంతో సన్మానించ వలసినదిగా కమిషనర్, దేవాదాయ శాఖ వారు ఆదేశించినందున శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కూడ అర్చక, వేద పండితునికి సన్మానం జరుగునని తెలిపారు. కావున భక్తులు, పెదకాకాని గ్రామస్తులు అధిక సంఖ్యలో తెలుగు నూతన సంవత్సర వేడుకలలో పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించి శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేసినారు.






# దివ్యాంగులకు ఉగాది కానుక దివ్యాంగ శక్తి

## -సీట్ల కేటాయింపులో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత -ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు.

**వట్టిచెరుకూరు, మార్చి18, ప్రభాతవార్త :** దివ్యాంగులకు ఉగాది కానుకగా ఖిదివ్యాంగ శక్తిఖి పథకం అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బోర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం టిడిపి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రామాంజనేయులు ఖిదివ్యాంగ శక్తిఖి పథకంపై బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఏడాది డిసెంబరు 3న నిర్వ హించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారని, ఆ మాటను ఇప్పుడు నిలబెట్టుకున్నారని తెలియ జేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మందికి లబ్ది పొందుతారని చెప్పారు. సీట్ల కేటాయింపులో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారని తెలిపారు. ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వారు, మూగ, చెవిటివారు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే



ఏపీఎస్ఆర్టీసీ సిటీ, ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని చెప్పారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం వీరికి 50శాతం రాయితీ లభిస్తోందన్నారు. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్న వారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోందని తెలిపారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం వర్తించే అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. వారితో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేదని, ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. శారీరక, మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుందని వెల్లడించారు. అవసరమైన డిజిటల్ పాస్లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా పొందవచ్చని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లలోని 134 కౌంటర్లలో దివ్యాంగులకు సేవలు అందుతాయని చెప్పారు. ఈ యాప్స్ ను సదరం యాప్ తో అనుసంధానించినందున ఫిజికల్ సర్టిఫికెట్స్ చూపించాల్సిన అవసరం లేదని, క్యూఆర్ కోడ్ తో ఉచిత డిజిటల్ పాస్ లు జారీ చేస్తారని తెలిపారు. పథకం అమలుకు ప్రభుత్వం ఏటా రూ.207 కోట్లు సబ్సిడీగా అందిస్తుందని వివరించారు.

# దివ్యాంగుల సంక్షేమం కోసం చంద్రబాబు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే ఆనందబాబు

**వేమూరు మార్చి 18 (ప్రభాతవార్త) :** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి కార్యక్రమంలో భాగంగా ఆర్టీసి బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ దివా ్యంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని తెలిపారు. సమాజంలో దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ పథకం ద్వారా వారి దైనందిన జీవితంలో కీలకమైన మార్పు రానుందని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఉపాధి, వైద్యం, విద్య వంటి అవసరాల కోసం ప్రయాణించే సమయంలో ఇకపై ఆర్థిక భారం తగ్గి, వారు మరింత స్వావలంబన సాధిస్తారని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివశించే దివ్యాంగులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో పెన్షన్లు పెంచినట్లు గుర్తు చేస్తూ, ప్రస్తుతం నెలసరి పెన్షన్ రూ.3000నుండి రూ.6000వరకు పెంచడం వారి పట్ల ఉన్న నిబద్ధతకు ఉదాహరణ అని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణం చేసి అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిపిఓ ప్రభాకర్‌రావు, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, జనసేన నేత ఉసారాజేష్, ఏఎంసి చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, తహశీల్దార్ సుశీల, టిడిపి నాయకులు మన్నే పసి, షేక్ హనీఫ్, బండారు సూరిబాబు, వేల్పుల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యాసిడ్ దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు

**కొల్లూరు, మార్చి 18 (ప్రభాతవార్త) :** బాలికలు, పిల్లలపై యాసిడ్ దాడులకు పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అమృతలూర ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం గాజుల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో మిషన్‌శక్తి 20రోజులలో భాగంగా పిల్లలపై యాసిడ్ దాడులు, బాల్య వివాహాల నిర్మూలన మహిళల ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశానికి సిడిపివో లక్ష్మీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యాసిడ్ దాడులు అంటే వ్యక్తుల శరీరంపై ఆసిడ్ లేదా రసాయనాలను విసిరి వారిని వికృత రూపంగా చేయడం, లేదా చంపటం చేసే పని అన్నారు. యాసిడ్ దాడులు ముఖ్యంగా మహిళలు బాలికలపై జరుగుతున్నాయన్నారు. ఇలాంటి సందర్భాలలో మహిళలు అప్రమత్తంగా ఉండి దాడులు చేసిన వ్యక్తులపై పోలీస్ రిపోర్టు ఇవ్వాలన్నారు. ఇలాంటి దాడులు చేసిన వ్యక్తులపై కఠిన శిక్షలు అమలు చేస్తుందన్నారు. అదే విధంగా బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరం అన్నారు. సమాజంలో బాల్య వివాహాలు నిర్మూలించడానికి ప్రజలు అధికారులు సమన్వయంగా పని చేయాలన్నారు. బాల్య వివాహాలు లేని సమాజం పురో అభివృద్ధికి చెందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహార పదార్థాలను గర్భవతులు బాలింతలు, పిల్లలు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. గర్భవతులు బాలింతలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. గ్రామంలో ముఖ్యంగా మహిళలు అంగన్‌వాడీ కేంద్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భవతులకు అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం యొక్క విలువలు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన సదస్సులు ద్వారా వివరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విజయలక్ష్మీ తల్లులు పాల్గొన్నారు.



# రేపల్లె మెయిన్,ఓల్డ్ కోర్స్ డ్రైన్ల పూడికతీతకు రూ.19.39 కోట్లు నిధులు మంజూరు

**రేపల్లె,మార్చి 18, ప్రభాతవార్త:** రేపల్లె మెయిన్ డ్రైన్,ఓల్డ్ కోర్స్ డ్రైన్‌లలో పూడికతీత పనుల నిర్వహణ కోసం రూ.10 కోట్ల 39 లక్షల 80 వేలు నిధులను ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ మంజూరు చేశారు.రేపల్లె మెయిన్ డ్రైన్ 5వ కి.మీ నుండి 25.2 కి.మీ వరకు పూడికతీత పనులకు రూ.7 కోట్ల 50 లక్షల 30 వేలు,ఆర్ఎం డ్రైన్ ఓల్డు కోర్స్ పూడికతీత పనులకు రూ.6 కోట్ల 99 లక్షల 50 వేలు,ఆర్ఎం డ్రైన్ మొదటి 5 కి.మీ వరకు డ్రెడ్జింగ్ పనుల నిమిత్తం రూ.4 కోట్ల 90 లక్షలు నిధులను మంజూరు చేస్తూ జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నందుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.పంట పొలాలు ముంపుకు గురై నష్టాన్ని చవిచూస్తున్న పరిస్థితుల నుంచి మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిష్కార మార్గం చూపించారని రైతులు పేర్కొన్నారు.

# ఏఎన్‌యు అధ్యాపకుడు జాన్‌బాబుకు ఏపి ఉగాది ప్రతిభా పురస్కారం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి18, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని లలిత కళల విభాగంలో అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న బండికొళ్ళ జాన్ రత్నబాబుకు ఏపి ప్రభుత్వం 2026-27 ఉగాది పురస్కారం ప్రకటించింది. చిత్రకళా విభాగంలో ప్రతిష్టాత్మకమైన ఉగాది ప్రతిభా పురస్కారంను అందుకోనున్నారు. జాన్ రత్నబాబు సమకాలీన కళారంగంలో



అంతర్జాతీయస్థాయిలో గురినతంపు పొందిన విజువల్ ఆర్టిస్ట్, కళను భావోద్వేగాల ప్రతిబింబంగా, సాంస్కృతిక విలువలు ప్రతినిధిగా భావిస్తూ ఆయన రూపొందించిన కళాకృతులు విశేష ఆదరణ పొందుతున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. విశాఖలో నిర్వహించిన జి-20 ప్రీ సమ్మిట్ సందర్భంగా ఆయన రూపొందించిన మ్యూరల్స్, డిజైన్‌లు వన్ ఎర్త్- వన్ ఫ్యామిలీ- వన్ ఫ్యూచర్ అనే సందేశాన్ని ప్రతిబింబిస్తూ దేశ విదేశాల ప్రతినిధులను ఆకట్టుకున్నాయి. ఆయన కళాకృతులు అంతర్జాతీయంగా యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, మలేషియా వంటి దేశాలలో ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలలో ప్రదర్శించబడ్డాయి. ఇప్పటివరకు ఆయన చిత్రాలు పది దేశాలకుపైగా కొనుగోలు చేయబడటం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసిన సందర్భంగా వీసి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సిడిఇ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య బ్రహ్మాజీరావు, సిఎస్ఆర్ ప్రోగ్రాం అధికారి ఎం.వి.రమణ, లలితకళల విభాగం కోఆర్డినేటర్ దేవకాంత్, అధ్యాపకులు వీరయ్య, ఫైర్‌సేఫ్టీ కోఆర్డినేటర్ రమణరావు తదితరులు జాన్‌రత్నబాబుకు అభినందనలు తెలిపారు.

# కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

## - కార్పొరేషన్ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 18 ( ప్రభాతవార్త ) :** గుంటూరు నగర ప్రజలు కార్పొరేషన్ కు ఆస్తి, నీటి, సీవరేజ్ పన్ను బకాయిలు వెంటనే చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. నగర కమిషనర్ కే మయూర్ అశోక్ ఆదేశాల మేరకు బుధవారం పన్ను బకాయిలపై సందేహాలు ఉన్న ఇళ్ల యజమానుల కోసం కార్పొరేషన్ క్యాష్ కౌంటర్ల వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో క్యాష్ కౌంటర్ల వద్ద హెల్ప్ డస్కులను ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా ఎటువంటి సందేహాలు ఉన్న కార్పొరేషన్ లోని కాల్ సెంటర్ ( 08632346103 ల్యాండ్ నెంబర్ కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. జీఎంసిలో క్యాష్ కౌంటర్ల వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ లతో పాటు కాల్ సెంటర్ పనితీరును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పన్ను చెల్లించేందుకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేనేజర్ బాలాజీ భాషకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలలో ఏక మొత్తంలో పన్ను చెల్లించే వారికి వడ్డీ లో 50 శాతం రాయితీ ఇచ్చిందని, రాయితీతో కూడిన స్లిప్పులను ప్రజలకు అందించటం జరుగుతుందన్నారు. ప్రజలు పన్ను చెల్లించటానికి అణువుగా ఉండే విధంగా గార్డెన్స్ లోని జిఎంసి సర్కిల్ కార్యాలయంలో, భారత్ పేట సచివాలయం (140), ఎల్ ఆర్ కాలనీ మెయిన్ రోడ్లు లోని సచివాలయం (53), వసంత రాయపురంలోని సచివాలయం (148), గోరంట్ల వినాయకుని గుడి వద్ద సచివాలయం (183), గుజ్జనగుండ్ల లోని సచివాలయం (106), సుద్దపల్లి డొంకలోని సచివాలయం (26), లలో ఆస్తి పన్ను చెల్లించేందుకుక్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, పన్ను చెల్లింపు దారుల కోసం తాగునీటి సౌకర్యం, టెంట్లు ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ వెల్లడించారు. గురు,శుక్రవారం పండుగల సెలవు రోజులైనప్పటికీ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# గ్యాస్ సిలిండర్లు అందక వినియోగదారుల ఇక్కట్లు

**కారంపూడి, మార్చి 18 ప్రభాతవార్త:** గ్యాస్ సిలిండర్లు అందక వినియోగదారులు అగచాట్లు పడుతున్నారు. గంటల తరబడి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. కారంపూడిలో భారత్ గ్యాస్ ఏజెన్సీ గత కొన్ని సంవత్సరాల నుంచి సేవలు అందిస్తుంది.



మండలంలోని 15 గ్రామాల్లో భారత్ గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. ఇటీవల ఏర్పడిన సంక్షోభంతో ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారు. గ్యాస్ బుక్ చేసినా సిలిండర్లు అందడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఏజెన్సీలు బినామీలకు సిలిండర్లను అందిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధిక ధరలకు బ్లాకులో విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.45 రోజులు దాటినా గ్యాస్ ఇవ్వడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. ఒక్క ఏజెన్సీ మాత్రమే ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరొక గ్యాస్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, మార్చి 18 ప్రభాతవార్త: పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విని, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం నారా చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, అభివృద్ధి పనులు పండుగలా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికి చేరవేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన




ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న చెరుకుపల్లి చెన్నకేశవ నగర్ కాలనీ వాసులు

చెరుకుపల్లి, మార్చి 18, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చెరుకుపల్లి శివారు చెన్నకేశవ నగర్ లో త్రాగునీరు సరఫరా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం సాయంత్రం నుండి నీటి సరఫరా లేక కాలనీవాసులు కిలోమీటర్ దూరంలో ఉన్న గ్రామానికి వచ్చి వాటర్ క్యాన్ల ద్వారా మంచినీళ్లు తీసుకు వెళ్లవలసిన దుస్థితి నెలకొంది. మంచినీరు సరఫరా చేసే ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా తరచూ నీటి సరఫరా సక్రమంగా ఉండటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలు చూపిస్తూ కాలనీకి మంచినీరు సకాలంలో వదలడం లేదని కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. 200 కుపైగా కుటుంబాలు నివసిస్తున్న కాలనీకి పంచాయతీ ద్వారా వచ్చే పైపుల ద్వారా నీరే ప్రధాన ఆధారం. కాలనీ పరిసర ప్రాంతాల్లో మంచినీటి బోర్లు పడే అవకాశం లేకపోవడంతో నిత్యం పంచాయతీ పైపుల ద్వారా వచ్చే నీటితోనే తమ అవసరాలను తీర్చుకోవాల్సి వస్తుందని ఏ ఒక్కరోజు నీరు రాకపోయినా తమ అవస్థలు వర్ణనాతీతం అని కాలనీవాసులు గోడు వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ఏర్పడి 18 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నీటి సమస్యకు పాలకులు, అధికారులు పరిష్కారం చూపలేకపోవడం పట్ల అసహన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవికాలం , గురువారం ఉగాది పండుగ అయినప్పటికీ నీటి సరఫరా లో నిర్లక్ష్యం వహించడం పట్ల ఉన్నతాధికారులు మరియు పాలకులు తగిన చర్యలు తీసుకొని నీటి సరఫరాకు ఆటంకాలు తొలగించాలని కాలనీ ప్రజానీకం విజ్ఞప్తి చేస్తుంది.

# అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే జూలకంటి

**కారంపూడి, మార్చి 18 ప్రభాతవార్త:** అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో చొప్పవరపు



వెంకాయమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కును ఎమ్మెల్యే జూలకంటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఎందరో అభాగ్యులకు సీఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కారంపూడి మండల మాజీ కోఆప్షన్ సభ్యులు తండా మస్తాన్‌జానీ, కారంపూడి పట్టణ మాజీ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, తదితర కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను వసూళ్లపై కసరత్తు

**కారంపూడి, మార్చి 18 ప్రభాతవార్త:** ఇంటిపన్ను వసూళ్లపై పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 63 శాతం పన్నులు వసూళ్లు చేసినట్లు తెలిపారు. మిరియాల, లక్ష్మీపురం, వేపకంపల్లి, ఇనుపరాజుపల్లి గ్రామాల్లో 100 శాతం, పెద్దకొదమగుండ్ల 95 శాతం, చిన్న కొదమగుండ్ల, కాచవరం, భట్టువారిపల్లె గ్రామాల్లో 75 శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగతా గ్రామాల్లో తక్కువగా వసూళ్ళు జరిగాయన్నారు. మార్చి 31 నాటికి నూరుశాతం వసూళ్లు చేసేందుకు ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్లు, మహిళా పోలీసులు, గ్రామాలోలన ఇంటి పన్ను వసూళ్లకు నిమగ్నమైనట్లు తెలిపారు. బకాయిలు ఆన్‌లైన్‌లో కట్టి రసీదులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇన్‌లైన్‌లోనే పన్ను కట్టే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామన్నారు.



# రహదారి నిర్మాణంలో నష్టపోయిన భూముల పరిశీలన

మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మాచర్ల పట్టణంలో బైపాస్ నిర్మాణంలో నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అర్జీ దాఖలు



చేయడంతో తహశీల్దారు కిరణ్‌కుమార్ అర్జీదారుల భూములను పరిశీలించారు. కంభంపాడుకు చెందిన రవిప్రకాష్, నరసింహారావులు కలెక్టరుకు అర్జీ ఇవ్వడంతో సర్వే నెం.187ఎ, 1053, మొదలగు సర్వే నంబర్లలోని భూమిని మండల సర్వేయరు, గ్రామ రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో విచారణ జరిపారు. కలెక్టరుకు నివేదించి వారికి న్యాయం జరిగేలా చూస్తామని తహశీల్దారు పేర్కొన్నారు.

# రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వీరే

**గుంటూరు లీగల్, మార్చి 18, ప్రభాతవార్త :**

రాష్ట్రం లోని దాదాపు 39 వేల మంది న్యాయవాదులకు ప్రతినిధిగా నిలిచే బార్ కౌన్సిల్ కు గత నెల 13వ తారీఖున జరిగిన ఎన్నికలకు సంబంధించిన పూర్తి ఫలితాలను మంగళవారం అర్ధరాత్రి దాటాక ఎన్నికల అధికారి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ ఏవి శేష సాయి ప్రకటించారు. మొత్తం 25 మంది సభ్యులు కాగా 23 మందిని కౌన్సిల్ లో సభ్యులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు ఎన్నుకుంటారు. మిగిలిన ఇద్దరిని కో ఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈసారి కచ్చితంగా మహిళా రిజర్వేషన్ కూడా అమలుపరిచారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చరిత్రలో తొలిసారిగా ఐదుగురు మహిళా న్యాయవాదులు ప్రతిష్టాత్మకమైన ఈ కౌన్సిల్ లో సభ్యులుగా ఎన్నికయ్యారు. మొత్తం 23 మంది సభ్యులలో 18 మంది పురుష న్యాయవాదులు. మెజారిటీ క్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు:బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన న్యాయవాదులకు వచ్చిన మెజారిటీ ఆధారంగా, తొలి స్థానంలో విజయవాడకు చెందిన సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ నిలిచారు. తర్వాత వరుస క్రమంలో కలిగినీడి చిదంబరం (హైకోర్టు), ఆలూరు రామిరెడ్డి (అనంతపురం), గొర్రెముచ్చు శాంత కుమార్, పట్టిజొన్నల బ్రహ్మారెడ్డి (గుంటూరు), యలమంజుల బాలాజీ (హైకోర్టు), బీవీ కృష్ణారెడ్డి (ఏలూరు), ఉప్పలపాటి శ్రీనివాసరాజు, సుంకర రాజేంద్రప్రసాద్ (విజయవాడ), కొమ్మసాని శ్రీనివాసుల రెడ్డి, ఎన్ వి సుమంత్ (హైకోర్టు), బెల్లాన రవి (విజయనగరం), బండారు వెంకటరమణమూర్తి (విశాఖపట్నం), ఘంటా రామారావు (హైకోర్టు), కీర్తి రామజోగేశ్వరరావు (విశాఖపట్నం), కొవ్వూరి వెంకట్రామిరెడ్డి, రోళ్ల మాధవి (హైకోర్టు), ఎస్ కృష్ణమోహన్ (విశాఖపట్నం), సత్తు అంకయ్య (నెల్లూరు), జంపని శ్రీదేవి (హైకోర్టు), ధోని మంజులత (విశాఖపట్నం), కె దుర్గా నాగశ్రీ (విశాఖపట్నం), రాగి గంగాభవాని (విజయవాడ) వరుసగా 23 స్థానాల్లో ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను బార్ కౌన్సిల్ కార్యదర్శి పద్మలత పర్యవేక్షించారు.

# ఎన్.ఈ.సీలో ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజైన్ పై అవగాహనా సదస్సు

**నరసరావుపేట మార్చి 18 ప్రభాతవార్త :** స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ఎస్ఆర్సి ఈ సొలుషన్స్ సౌజన్యంతో ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజైన్, అసెంబ్లీ మరియు కోడింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. వివరాలను కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్ బుధవారం తెలియజేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న 80 మంది విద్యార్థులకు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ముగిశాయని మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి. వేంకట శివ తెలిపారు. ఎస్ఆర్సి ఈ సొలుషన్స్ ఆర్ డి ఇంజనీర్ పి.ఎస్.సత్య కుమార్ విద్యార్థులకు శిక్షణ అందించారు. రోబోటిక్స్ అనేది పనిచేసే యంత్రాలను సృష్టించడానికి క్యాడ్ మోడలింగ్, మెకానికల్ అసెంబ్లీ మరియు సాఫ్ట్వేర్ డెవలప్ మెంట్లను మిళితం చేస్తూ, రూపకల్పన (డిజైన్) చేయడం, సమీకరించడం మరియు కోడింగ్ చేయడం వంటి ప్రక్రియలను కలిగి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, పిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, వైస్ పిన్సిపాల్ డాక్టర్ డి. సునీల్, అధ్యాపకులను, విద్యార్థులు, సమన్వయకర్త ఎం. వెంకన్న బాబు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న జీవీ,మక్కెన

**వినుకొండ,మార్చి18,ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని పట్టణంలోని ఇందిరానగర్ వద్ద గల మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు



కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. స్వయంగా పదార్థాలను వడ్డించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# త్రికోటేశ్వరుని ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

**నరసరావుపేట, మార్చి 18 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ పై వేంచేసి ఉన్న త్రికోటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక అక్షరా భ్యాసాలను నిర్వహిస్తున్నారు. బుధ వారం వివరాలను ఆలయ దేవస్థాన ఈ.ఓ, సహాయ కమిషనర్ డి చంద్రశేఖర్ తెలియజేశారు. రేపు ( గురువారం )ఉగాది పర్వదిన సంద ర్భంగా ఈ కార్యక్రమం జరుగుతుం దన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది నిర్వహించే సామూహిక అక్షరాభ్యాస సంప్రదాయం ఈ ఏడాది కూడా కొనసాగుతుందన్నారు. చిన్నారులతోపాటు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మేధా దక్షిణామూర్తి సన్నిధిలో జరిగే అక్షరాభ్యాసాలతో ప్రతి చిన్నారికి చదువులో విజయాలు లభిస్తాయి అని పేర్కొన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించామన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహాయ కమిషనర్ డి చంద్రశేఖర్ కోరారు.

# ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపిన చీఫ్‌విప్ జీవీ,డీసీసీబీ మక్కెన

**వినుకొండ, మార్చి18, ప్రభాతవార్త:** ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా,వినుకొండ నియోజక వర్గ ప్రజ ానీకానికి,కూటమి నాయకులు, కార్యకర్తలకు ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ప్రజల సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అయిన ఉగాది పండుగను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.





# వినుకొండ మండలంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం

**వినుకొండ,మార్చి18,ప్రభాతవార్త:** రైతన్నా మీ కోసం వారోత్సవాల్లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలతో పాటు ఐదు ముఖ్య సూత్రాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ప్రచార పత్రికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు వరం

**-గుంటూరులో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్,హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, కూటమి నాయకులు**

**గుంటూరు, మార్చి 17, ప్రభాతవార్త :** దేశంలో ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించిన దివ్యాంగ శక్తి పథకం కేవలం బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాదని, అది వారి ఆత్మాభిమానాన్ని కాపాడే అస్త్రమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరులో దివ్యాంగ శక్తి పథకాన్ని బస్టాండ్ లో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుల్లో దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రయాణించారు. దివ్యాంగులతో



మాట్లాడి నూతన పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా వారితో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 12.5 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూర్చేలా దివ్యాంగ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. ఇదే కాకుండా దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి కోసం స్వయం ఉపాధి రుణాలు అందించినట్లు చెప్పారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ద్వారా దివ్యాంగుల ఆత్మాభిమానాన్ని కాపాడామని చెప్పారు. బస్సుల్లో దివ్యాంగులకు ఒక సీటు రిజర్వేషన్ ను పక్కాగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పడానికి సంతోషిస్తున్నామని అన్నారు. దివ్యాంగ నాయకులు పోక బాలాజీ, జబ్బు మంగ తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత ప్రయాణమే కాదు.. ఆత్మ గౌరవ అస్త్రం**

**దివ్యాంగ శక్తి ఒక దివ్యాంగులకు వరం :** దేశంలోనే ప్రప్రథమం కావడం విశేషంపింఛన్ రెట్టింపు చేసిన ఘనత కూటమిదే..దివ్యాంగులకు అండగా నిలిచిన సీఎం, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలుగుంటూరులో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, కూటమి నాయకులుదేశంలో ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించిన దివ్యాంగ శక్తి పథకం కేవలం బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాదని, అది వారి ఆత్మాభిమానాన్ని కాపాడే అస్త్రమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్



నసీర్ అన్నారు. గుంటూరులో దివ్యాంగ శక్తి పథకాన్ని బస్టాండ్ లో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుల్లో దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రయాణించారు. దివ్యాంగులతో మాట్లాడి నూతన పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా వారితో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 12.5 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూర్చేలా దివ్యాంగ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. ఇదే కాకుండా దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి కోసం స్వయం ఉపాధి రుణాలు అందించినట్లు చెప్పారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ద్వారా దివ్యాంగుల ఆత్మాభిమానాన్ని కాపాడామని చెప్పారు. బస్సుల్లో దివ్యాంగులకు ఒక సీటు రిజర్వేషన్ ను పక్కాగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పడానికి సంతోషిస్తున్నామని అన్నారు. దివ్యాంగ నాయకులు పోక బాలాజీ, జబ్బు మంగ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థి మృతి పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

**వట్టిచెరుకూరు, మార్చి18, ప్రభాతవార్త :** బీసీ బాలురు వసతి గృహంలో ఉంటూ విద్యన భ్యసిస్తూ పరీక్ష సక్రమంగా రాయలేదనే మనస్థాపనతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విద్యార్థి పట్ల స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు బుధవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, నాగులవరం గ్రామానికి చెందిన మందల రామయ్య, లింగమ్మ దంపతుల ప్రథమ కుమారుడు మందల రాకేష్(19) మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతీ గృహంలో 2022 23లో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం అదే హాస్టల్లో ఉంటూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు. ఈనెల 16వ తేదీన జరిగిన తెలుగు పరీక్షను అనుకున్నంతగా రాయలేకపోయాననే ఆలోచనతో, క్షణికమైన ఒక ఉద్రేకంతో గ్రామ నడిబొడ్డున ఉన్న మంచినీటి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడం చాలా దురదృష్టకరమన్నారు.పదో తరగతి పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి తెలియజేయునదే పరీక్షలనేవి విద్యాభ్యాసంలో ఒక భాగం మాత్రమే అన్నారు.

ఈ విద్యాభ్యాసంలో అనేక పరీక్షలు జరుగుతాయని, ఒక్కొక్కసారి వ్రాసిన పరీక్షలలో మార్కులు తగ్గుతాయి, అలాగే పెరుగుతాయి, అలా అని పరీక్షలు ఒక్కటే జీవితంలోని ఎదుగుదలకు అడ్డకాదని తెలుసుకోవాలని సూచించారు.



నూటికి నూరు శాతం మార్కులు వస్తేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయనేది అవివేకమని గుర్తుంచుకోవాలన్నారు.శక్తి మేరకు చదవండి, పరీక్షలు రాయండి, అంతేతప్పా రాసిన పరీక్షల్లో ఫలితాల మీద ఊహాగానాలతో జీవితాన్ని ముగించడం ఏమాత్రం సభబు కాదని తెలిపారు. ఎందుకంటే మనకు జన్మనిచ్చిన తల్లి, చిన్నప్పటి నుంచి కష్టసుఖాలు తెలియకుండా పెంచిన తండ్రి మరియు మీతోటి అక్కచెల్లెలు, అన్నదమ్ముళ్ల కోసం మరియు మన భవిష్యత్తు కోసం మనం బ్రతకాలని ఉద్ఘాటించారు.పదో తరగతి తర్వాత అనేక చదువులు ఉంటాయని, పరీక్షలలో ఒక్క పేపర్లోనే మార్కులు రాకపోవడం ఒక భాగం మాత్రమేనని,దయచేసి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని తెలియజేశారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా మరియు జనక ఉద్రేకాలకు గురికావద్దని ప్రతిఒక్క విద్యార్థికి పేరుపేరునా మనవి చేసారు. అనంతరం విద్యార్థి తండ్రితో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థి మృతిపై మంత్రి నారా లోకేష్ బాబుతో చర్చిస్తామన్నారు. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిసిన సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం : కళాశాల ఈగల్ క్లబ్

**పెదనందిపాడు, మార్చి 18, (ప్రభాతవార్త) :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం పూర్తయిన సందర్భంగా, పెదనందిపాడు ఆర్ట్స్ అండ్



సైన్స్ కళాశాల ఈగల్ క్లబ్ ఛైర్పర్సన్. పెదనందిపాడు ఎస్ఐ సత్యనారాయణ విద్యార్థులకు ముఖ్యమైన కౌన్సిలింగ్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ సత్యనారాయణ మాట్లాడుతూ,విద్యార్థులు పరీక్షల అయిపోయిన సందర్భంగా అత్యుసాహంతో ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దు, ఎలాంటి గొడవలలో పాల్గొనకూడదని సూచించారు. అలాగే, సెలవులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి పెట్టాలని, చట్టపరమైన సమస్యల్లో ఇరుక్కుంటే మీ భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు.ఆంధ్రప్రదేశ్లో కళాశాలలో ఈగల్ క్లబ్స్ యొక్క విధులు: ముఖ్యంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించేందుకు, విద్యార్థులను మార్పుకర్తలుగా తీర్చిదిద్దడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం,ఈ క్లబ్స్ ముఖ్య ఉద్దేశం అన్నారు. క్లబ్ సభ్యులు ప్రధానంగా ప్రిన్సిపాల్ మరియు లోకల్ పోలీస్ స్టేషన్ హెడ్, ఛైర్పర్సన్స్ గా ఇద్దరు అధ్యాపకులు , అలాగే 8 మంది విద్యార్థులు సభ్యులుగా ఉంటారు, వారంతా ప్రతి అకాడమిక్ సంవత్సరం ఈగల్ క్లబ్ యాక్టివిటీస్ పునఃసమీకరణం చేస్తారు. అలాగే విద్యా సంవత్సరం లో స్టూడెంట్స్ కి పలు కౌన్సెలింగ్ కార్యక్రమాలు ఈగల్ క్లబ్స్ ద్వారా నిర్వహించడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే ప్రతాప్ కుమార్. ఎన్. సీ.సీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్. కళాశాల అధ్యాపక . అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది : దేగల ప్రభాకర్

**గుంటూరు, మార్చి 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ స్పష్టం చేశారు. నేడు ప్రారంభించిన ̃దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణస్తూ ఎంతోలబ్ధిపొందుతున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా దివ్యాంగుల పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదేనని గుర్తు చేశారు. ఛార్జీలు లేకుండా ఐదు రకాల బస్సులలో ఉచితంగా ప్రయాణించ వచ్చన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.చరిత్రలో దివ్యాంగులకు ఎప్పుడు మేలు జరిగినా అది సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందని ఛైర్మన్ దేగల ప్రభాకర్ గుర్తు చేశారు.టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి యేటా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించి వారిలోని ప్రతిభను గుర్తించేలా చేశామన్నారు.దివ్యాంగుల కోసం టీడీపీ అమలుచేసిన ప్రత్యేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు.టీడీపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి రాగానే 40 శాతం నుంచి 79 శాతం వరకు వైకల్యం ఉన్న దివ్యాంగులకు అప్పటివరకు అందుతున్న రూ.500 పింఛన్ను రూ.1000కి పెంచిందన్నారు. ఇలా ఐదేళ్ల వ్యవధిలో దివ్యాంగుల పింఛన్ మొత్తన్ని రూ.500 నుంచి రూ.2వేలు, రూ.3వేలకు పెరిగిందన్నారు.2019 జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే వైకల్య శాతంతో పని లేకుండా పింఛన్ అందరకీ ఒకేలా అందజేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల పింఛన్ ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుందన్నారు.



## వ్యవసాయంలో పంచ సూత్రాలు పాటించాలి : ఏడిఏ మోహన్ రావు

**పెదనందిపాడు, మార్చి 18, (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలంలోని అబ్బినేని గుంట పాలెం, వరగాని , అన్నపర్రు గ్రామాలలోని రైతుసేవ కేంద్రాల లో బుధవారం నిర్వహించిన రైతన్న మీకోసం వారోత్సవాలు కార్యక్రమంలో గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు, ఎన్ మోహన రావు మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం లు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ రైతన్న మీకోసం కార్యక్రమం నేటి ఈ మూడు రోజులుగా నిర్వహిస్తున్నామని ఇంకా ఈనెల 23.24.25 తేదీలలో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. రైతు సేవ కేంద్రాలలోని వీఏఎ లు మరియు విహెచ్ఎ లు ఆధ్వర్యంలో రోజుకు గ్రామంలోని 30 క్లస్టర్లు అనగా, ఒక్కొక్క క్లస్టర్ లో ముగ్గురు రైతుల చొప్పున 90 మంది రైతులకు రైతున్నా మీకోసం కరపత్రాలను అందజేసి, రైతులు యొక్క శ్రేయస్సు కొరకు ఐదు ప్రధాన అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఏ డి ఏ. ఎన్ మోహనరావు తెలిపారు.

నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటల సాగు చేయుట,రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిట చేరవేయడానికి అగ్రిటెక్ గురించి వివరించుట,సమగ్ర డిజిటల్ వ్యవస్థ గురించి రైతులకు తెలియజేయడం, రైతులు పండించినటువంటి పంటలకు నాణ్యమైన మద్దతు ధర రావాలి అంటే ఫుడ్ ప్రాసెసింగ్ చేయించుట అదేవిధంగా అన్నదాత సుఖీభవ ,పీఎం కిసాన్ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించడం జరుగుతుంది అని



తెలియచేశారు. మండల వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ రైతులకు పంటల వారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు మద్దతు ధర అందించి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది అని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను కూడా రైతులకు తెలియజేయాలని సూచించారు , రైతులు అందరూ కూడా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని, ఏపీ ఏ ఐ ఎం ఎస్ 2.వీ యాప్ అందరూ ఫార్మర్స్ డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా రైతుకు సంబంధించిన వ్యవసాయ వివరాలు అన్ని మన ఫోన్ లోనే వస్తాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల మరియు గ్రామ స్థాయి నాయకులు, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్, రైతు సేవ కేంద్రం సిబ్బంది, మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నాయకులు పోపూరి వెంకటప్పయ్య. బండారు రాంబాబు. పలువురు రైతు సోదరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ముస్లింల జీవితాల్లో వెలుగులు

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, మార్చి 17, ప్రభాతవార్త :** కూటమి పాలనలో ముస్లిం మైనారిటీల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే,, అసెంబ్లీ మైనార్టీ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముస్లింలను రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రంజాన్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. గత వైసీపీ పాలనలో మోజన్లు, ఇమామ్ లక గౌరవ వేతనం కూడా ఎగనామం పెట్టారని



విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.45 కోట్లు ఇమామ్, మోజన్లకు గౌరవ వేతనాన్ని విడుదల చేశామని తెలిపారు. కడపలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో హజ్ హౌస్ నిర్మిస్తే దానిని వైసీపీ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముస్లిం కుటుంబాల్లో ఎంత మంది చదువుకుంటే అంత మంది పిల్లలకు 15 వేల రూపాయలు అందించామని తెలిపారు. హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు అందిస్తూ విజయవాడలోని విద్యాధరపురంలో హజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇఫ్తార్ విందు నిర్వహించేందుకు నిధులు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో విదేశీ విద్య పథకాన్ని నిర్వీర్యం చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల విద్యకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. గతాడాది బడ్జెట్లో ముస్లింలకు రూ.5400 కోట్ల కేటాయిస్తే ప్రస్తుత ఏడాది రూ.65 కోట్లు కేటాయించి ముస్లింల మైనారిటీల పక్షపాతి ప్రభుత్వం అని నిరూపించుకున్నామని చెప్పారు. దూదేకులకు రూ.100 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. హజ్ యాత్రికులకు విజయవాడ ఎయిర్ పోర్టు నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ముస్లిం సమాజానికి గౌరవంగా భావించే హజ్ హౌస్ నిర్మాణాన్ని అమరావతిలో ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో 4.38 లక్షల మంది మైనారిటీలకు రూ.3511 కోట్లతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఉర్దూను తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేస్తే ప్రస్తుత ప్రభుత్వం అకాడమీ ఏర్పాటుకు రూ.7 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కోటి రూపాయలు కేటాయించామని చెప్పారు.

## విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక విభాగాల్లో రాణించాలి : ఛైర్మన్ చందు రామారావు

**వట్టిచెరుకూరు, మార్చి18, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపాలని ఛైర్మన్ చందు రామారావు, సెక్రటరీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కుర్నూతల ఐదో మైలు వద్దనున్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో రెండు



రోజుల పాటు జరిగిన వార్షికోత్సవ వేడుకలు కళాశాల ఛైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ఛైర్మన్, సెక్రటరీలు హాజరై జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం వారు మాట్లాడుతూ..విద్యార్థులు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళిక బద్ధంగా లక్ష్యసాధనకు కృషి చేయాలని కోరారు. ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియజేశారు. ఇటువంటి వేదికలు విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి దోహదపడతాయని చెప్పారు. సమాజం పట్ల ప్రేమ, దయ, కరుణతో మెలగాలని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, సామాజిక సేవాభావాన్ని అలవర్చుకోవడం వల్ల దేశం అభివృద్ధి సాధిస్తుందని వివరించారు. విద్యార్థులు గురువుల సలహాలు సూచనలు పాటిస్తూ లక్ష్య సాధనకు కృషిచేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా డి ఫ్లస్ కొరియోగ్రాఫర్ ఖన్నా టీం అందించిన డాన్స్ ప్రదర్శనకు విద్యార్థులు కేరింతలు, ఈలలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం మార్మోగింది.కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చందు రోహిత్, ప్రిన్సిపాల్ డా.డివివిఎస్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపల్ కె. కిరణ్ కుమార్, డైరెక్టర్ చందు రవికుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చందు బాబురావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య రంగం అభివృద్ధికి ఏఐ దోహదం

**- హెల్త్కేర్ మేనేజ్మెంట్పై ముగిసిన జాతీయ సదస్సు**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి18, ప్రభాతవార్త:** వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ (కృత్రిమమేధస్సు) ద్వారా ఆరోగ్య రంగంలో ఖచ్చితత్వ ఫలితాలు సాధ్యమౌతాయని ప్రొఫెసర్ బట్టు నాగరాజు పేర్కొన్నారు. ఏఎన్యులోని ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో " ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఇన్ హెల్త్కేర్ మేనేజ్మెంట్: ఎమర్జింగ్ ట్రెండ్స్ ఛాలెంజస్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య బట్టు నాగరాజు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సదస్సు నిర్వహణకు సహకరించిన వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏఐజి హాస్పటల్స్ చెందిన క్లినికల్ ట్రయల్స్ అండ్ డాటా సైంటిస్ట్ డాక్టర్ రాజేష్ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో డేటా సైన్స్, ఏఐ కీలకపాత్ర పోషిస్తున్నాయని, క్లినికల్ ట్రయల్స్లో ఖచ్చితత్వం, వేగం పెంచడంలో ఏఐ సహాయపడుతుందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ కన్సల్టెంట్ డా.జ్యోతి మాట్లాడుతూ ప్రజారోగ్య రంగంలో ఏఐ వినియోగం ద్వారా ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపర్చడంలో ఏఐ ద్వారా సమర్థవంతంగా అమలు



చేయవచ్చునన్నారు. చిత్తూరులోని అపోలో యూనివర్సిటీ సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఏఐ ద్వారా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్లో పారదర్శకత, సమర్థత పెరుగుతుందన్నారు. ఆశ్రామ్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ అండ్ మెడికల్ సైన్సెస్ సిఇఓ డాక్టర్ రాజరాజన్ మాట్లాడుతూ హాస్పటల్స్లో ఏఐ ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీలతో సేవల వేగం పెరిగి రోగులకు మెరుగైన అనుభవం లభిస్తుందన్నారు. మంగళగిరి ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ వంశీకృష్ణ రెడ్డి ఏఐ వైద్యరంగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తుందన్నారు. ఈ సదస్సులో విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాధిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్ చుండి, వర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## అలరించిన వివిఐటియూ రంగస్థల వేడుక

**గుంటూరు విద్య మార్చి 18 ప్రభాతవార్త :** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నందు నిర్వహించిన థియేటర్స్ డే వేడుక వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ వినోదం, విజ్ఞానం మేళవింపుతో వివిఐటియూ విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు అలరించాయి. ఈ వేడుక నందు విభాగాల వారీగా ప్రదర్శించిన 10 నాటికలను విద్యార్థులు వారి వేషధారణ, హావభావాలతో రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి రంగస్థల నటుడు, నరసరావుపేట రంగస్థల నిర్వాహకుడు షేక్ బాజీ న్యాయనిర్ణేతగా వ్యవహరించగా విజేతలకు వివిఐటియూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అందజేశారు. ఈ నాటక పోటీలలో అన్యాయాలు, అసమానతలు వ్యక్తి ఎదుగుదల పై ఏ విధంగా ప్రభావం చూపుతాయో తెలిపే విధంగా సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం విద్యార్థులు



ప్రదర్శించిన "మాయ" నాటకం మొదటి బహుమతి గెలుపొందగా, క్లిష్ట సమయాలలో మనిషి తప్పు త్రోవ పట్టకుండా సరైన పరిష్కారం ఏ విధంగా కనుగొనాలి అని తెలుపుతూ ఈసీఈ విద్యార్థులు ప్రదర్శించిన "రథ సారథి" నాటిక ద్వితీయ బహుమతి, ఆత్మగౌరవం మరియు పట్టుదల ఉంటే విజయం తప్పక వరిస్తుందని తెలిపే విధంగా ఈఈఈ విద్యార్థులు ప్రదర్శించిన "థ్యాంక్యూ నాన్న" తృతీయ బహుమతి గెలుచుకున్నాయి. రథసారథి నాటకం నుండి ఈసీఈ విద్యార్థి శ్రీకృష్ణ ఉత్తమనటుడు పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాా వై. మల్లికార్జునరెడ్డి, అకాడమిక్ డీన్ డాా కె. గిరిబాబు, థియేటర్స్ డే సమన్వయకర్త షేక్. రసూల్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

**మంగళగిరి, మార్చి 18, ప్రభాతవార్త :** శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భారీగా పాల్గొన్న భక్తుల రద్దీతో కిటకిటలాడింది.బుధవారం మంగళగిరి



శివాలయం సమీపంలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మెట్ల మార్గం వద్ద జరిగిన ఈ కార్యక్రమం భక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలిచింది.ప్రతినెల అమావాస్య రోజున నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ హాజరయ్యారు. ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, అన్నప్రసాదం పంపిణీలో పాల్గొని భక్తులకు సేవలందించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ పరమశివుని కృపతో పాటు భక్తులు, దాతల సహకారంతో ఈ అన్నదాన యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుండటం సంతోషకరమని తెలిపారు. ప్రతి అమావాస్యకు 4000 వేలా మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించడం మాకు ఆధ్యాత్మిక తృప్తిని ఇస్తుందన్నారు.కార్యక్రమాన్ని మరింత విస్తరించాలనే సంకల్పంతో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో పెద్ది రాజులు, కటారి విష్ణుమూర్తి, మారం మల్లికార్జునరావు, పేరుమళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివ, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, వాసు, ముద్ర బోయిన శ్రీనివాసరావు, ప్రసాదరావు, కోదాటి శ్రీనివాసరావు, కగ్గ శీను, పందేటి శ్రీనివాసరావు, రెడ్డి వీరరాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ, వేల్పూరి దుర్గారావు, శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా బూత్ కమిటీలతో కీలక సమావేశం

**మంగళగిరి, మార్చి 18, ప్రభాతవార్త:** మంగళగిరి బైపాస్ రోడ్ లోని నియోజకవర్గ వైకాపా కార్యాలయం లో బూత్ కమిటీ అధ్యక్షులతో సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు దర్శి.రమేష్



ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమరెడ్డి బూత్ కమిటీ అధ్యక్షులకు స్పెషల్ ఇంటెన్సీ రివిజన్, బిఎల్ఏ 2 నియామకం గురించి ఓటర్ లిస్ట్ జాబితా మార్పులు చేర్పులుపై దిశ నిరద్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు పిచ్చి రెడ్డి, మంగళగిరి పట్టణ బూత్ కమిటీ అధ్యక్షులు షఫీ, మంగళగిరి మండల బూత్ కమిటీ అధ్యక్షులు మండేపూడి నాగరాజు, దుగ్గిరాల మండలం బూత్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ సలాం, తాడేపల్లి పట్టణ బూత్ కమిటీ అధ్యక్షులు అజీజ్, తాడేపల్లి తాడేపల్లి మండల బూత్ కమిటీ అధ్యక్షులు తిరుమల రెడ్డి, గుంటూరు జిల్లా బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల కోసం ప్రజల కంగారు పడాల్సిన అవసరం లేదు: సివిల్ సప్లై అధికారి శివశంకర్

**పెదనందిపాడు మార్చి 18 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండల కేంద్రంలో హెచ్పి గ్యాస్ ఏజెన్సీలో సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం. గ్యాస్ ఆఫీస్ మరియు గూడెం తనిఖీ చేసి సిలిండర్ల నిలువలను సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ శివశంకర్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలు గ్యాస్ కోసం ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని సరిపడ గ్యాస్ సిలిండర్లో నిల్వ ఉన్నాయి అన్నారు .గ్యాస్ ఆఫీస్ తనిఖీ చేయగా 506 సిలిండర్లు ఇంకా నిల్వ ఉన్నాయని.గ్యాస్ అవసరమైతేనే బుకింగ్ చేసుకొని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.



# రెండు దశాబ్దాల సమస్యను పరిష్కరించిన తహశీల్దార్ గోపాలకృష్ణ

## స్మశానం విషయంలో ఇరువర్గాలు రాజీ



**తెనాలి టౌన్, మార్చి18,(ప్రభాతవార్త):** తెనాలి రూరల్ మండల గ్రామం కఠెవరం లో గత రెండుదశాబ్దాలుగా,హిందూ/క్రిస్టియన్స్ వర్గాల నడుమ వివాదాన్ని, గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్,ఇతర పెద్దలు మరియు తహసీల్దార్ కేవి.గోపాలకృష్ణ ప్రత్యేక చొరవతో పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే,కఠెవరం గ్రామము,సర్వే నంబర్ 317లో గల హిందూస్మశానం విషయమై సుమారు ఇరవై సంవత్సరాలుగా గ్రామస్తుల మధ్య వివాదం కొనసాగుతూ వచ్చుచున్నది.ఈ విషయమై న్యాయస్థానములలో కేసులు నడుస్తుండగా, గ్రామంలో ఎప్పుడైనా మరణం సంభవించిన సందర్భాలలో ఈ సమస్య మళ్లీ మళ్లీ చెలరేగి శాంతిభద్రతల సమస్యగా మారుతూ వస్తుంది,అదేవిధంగా, క్రైస్తవ సమాజం వారు సదరు స్మశానాన్ని తొలగించవలెనని డిమాండ్ చేయుచుండగా, హిందూసమాజం వారు తమ సంప్రదాయ హక్కులను వినియోగించుకొనుటకు పట్టుబడుచుండుట వల్ల ఈ సమస్య గ్రామంలో నిరంతర ఉద్రిక్తతలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో,ఫిబ్రవరి 28న పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా,రెండు వర్గాలైన హిందూ సేవసమితి దళిత హక్కుల సేవ సమితి ప్రతినిధులతో కలిసి,గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాదరావు మరియు తహశీల్దార్ చర్చలు నిర్వహించగా,రెండు వర్గముల మధ్య పరస్పర అవగాహనతో సఖ్యతా వాతావరణంలో సమస్యను పరిష్కరించుటకు ఒప్పందం కుదిరినది.దీనితో బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రెండు వర్గముల వారు తమ అంగీకారాన్ని సమర్పించగా, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు సృష్టించకుండా పరస్పరం సహకరించుటకు అంగీకరించిరి. అలాగే, కోర్టు కేసులను కూడా ఉపసంహరించు కొనుటకు అంగీకరించారు.ఈ సందర్భంగా, సుమారు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ దీర్ఘకాలిక వివాదం పరస్పర చర్చలు, సమన్వయం మరియు పరిపక్వ దృక్పథంతో శాశ్వత పరిష్కారానికి వచ్చినదని తహసీల్దార్ గోపాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు."రాజీ మార్గమే రాజమార్గం" అనే ఆర్యోక్తి ఈ సందర్భంలో సాక్షాత్కారమై, విభేదాలకు ముగింపు పలికినది. ఈ సమస్య పరిష్కారంలో క్రియాశీలకంగా కృషి చేసిన గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాదరావు కి తహసీల్దార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్ లో కఠెవరం గ్రామంలో సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం మరియు ఐక్యత మరింత బలపడుతూ,శాంతి, సామరస్య వాతావరణంలో గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగునని దృఢంగా విశ్వసించుచు న్నానని తహసీల్దార్ కేవి.గోపాలకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉగాది పురస్కారానికి ఎంపికైన తెనాలి యువశిల్పి రవిచంద్ర



**తెనాలి టౌన్,మార్చి18,(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న ఉగాది పురస్కారానికి తెనాలి చెందిన అంతర్జాతీయ శిల్పి కాటూరి రవిచంద్ర ఎంపికయ్యారు.వంశపారం పర్య శిల్పకళలో స్థిరపడిన కాటూరి కుటుంబానికి చెందిన ఐదవ తరం శిల్పి రవిచంద్ర . చిన్ననాటి నుంచే శిల్పకళలో నైపుణ్యం సాధించిన ఆయన, జేఎన్‌టీయూ నుండి బీ.ఎఫ్.ఏ మరియు కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎఫ్.ఏ పూర్తి చేశారు.ఈ రెండు విశ్వవిద్యాలయాల్లో గోల్డ్ మెడల్స్ సాధించడమే కాకుండా,కలకత్తా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం ఒకే ఒక్క విద్యార్థికి అందజేసే గవర్నర్స్ అవార్డును కూడా అందుకున్నారు.తండ్రి కాటూరి వెంకటేశ్వర రావు స్థాపించిన "సూర్య శిల్పశాల"ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో రవిచంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉగాది పర్వదినాన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందించే ఉగాది పురస్కారాన్ని రవిచంద్ర స్వీకరించనున్నారు. ఉగాది సందర్భంగా ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక కళారత్న (హంస) పురస్కారాలు మరియు ఉగాది (తెలుగు తల్లి పురస్కారాల) కోసం రూపొందించిన ప్రతిమలను శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు , కాటూరి రవిచంద్ర లు తయారు చేయడం విశేషం.ఈ సందర్భంగా, సూర్య శిల్పశాల సిబ్బంది,పలువురు అభిమానులు రవిచంద్ర ను అభినందించారు.

# స్కూటీ ఢీకొని ముఠా కార్మికుడు మృతి

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి18,(ప్రభాతవార్త):** తెనాలి మార్కెట్ వంతెన ప్రాంతంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముఠా కార్మికుడు మృతి చెందాడు. పట్టణంలోని బాలాజీ రావు పేటకు చెందిన నాగమల్లేశ్వర రావు ముఠా కార్మికునిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి నడిచి వెళుతున్న క్రమంలో మార్కెట్ వంతెన సమీపం లోకి రాగానే వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.ఈ ఘటనలో వాహనం నడుపుతున్న యువకుడు సంజు మరియు అతనితోపాటు ఉన్న ట్రాన్స్ జెండర్ కు స్వల్ప గాయాలయ్యాయి.



సమాచారం అందుకున్న 3 టౌన్ ఎస్సై షేక్ కరీముల్లా తన సిబ్బందితో ఘటనాస్థలికి వచ్చి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల కథనం మేరకు మితిమీరిన వేగంతో వస్తున్న ద్విచక్ర వాహనం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా త్రీటౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. సాంబశివరావు మాట్లాడుతూ, మార్కెట్ సెంటర్ వద్ద జరిగిన ప్రమాదం మితిమీరిన వేగం రాష్ డ్రైవింగ్ వల్లనే జరిగిందన్నారు. వాహనదారుడైన సంజు అనే ట్రాన్స్ జెండర్ మరొక యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తు ప్రమాదానికి కారణమయ్యారని తెలిపారు. పట్టణంలో,ర్యాష్ డ్రైవింగ్ పెరిగిపోతుందని,మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని అయినా కొందరు యువత అధిక వేగంతో ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

# తెనాలిలో అకస్మాత్తుగా కూలిన భారీ ఫ్లెక్సీ,తప్పిన ప్రమాదం

**తెనాలి మున్సిపాలిటీ మార్చి18,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో గల శివాజీ చౌక్ ప్రాంతంలోని జామియా మసీదు సమీపంలో ఉగాది,రంజాన్ పండుగ శుభాకాంక్షలు



తెలియజేస్తూ ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ బుధవారం మధ్యాహ్నం భారీ గాలులకు నేలకొరిగింది. అకస్మాత్తుగా కుప్పకూలిన భారీ ఫ్లెక్సీ అక్కడ అరటిపళ్ళ వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులపై పడింది. ఫ్లెక్సీ పడిపోవటాన్ని గమనించిన కొందరు చిరు వ్యాపారులు చేరుకొని తప్పుకోవటంతో పెను ప్రమాదం తప్పింది. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలను నియంత్రించ లేకపోవటం వల్లనే పట్టణమంతా ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని పురపాలక సంఘ అధికారులు వీటిపై దృష్టి పెట్టకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలకు అనుమతులు ఇచ్చి సామాన్యులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించడంలో మున్సిపల్ యంత్రాంగం చూపిస్తున్న అత్యుత్సాహం నేడు భారీ ఫ్లెక్సీ విషయంలో తెల్ల తేటమయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికార యంత్రాంగం స్పందించి పట్టణంలోని అనధికార ఫ్లెక్సీలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

## -మున్సిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి18,(ప్రభాతవార్త):** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ కాళ్ళపై తమ నిలబడాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సూచించారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయం



ఎదుట డ్వాక్రా మహిళలచే ఏర్పాటు చేయబడ్డ మెప్మా బజార్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు ఉత్పత్తులు,వివిధ రకాల తినుబండారాలు, పచ్చళ్ళు,దుస్తులు, మహిళలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు, గృహోపకరణాలు వంటి వాటిని ఆయన తిలకించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం కల్పించిన అన్ని సౌకర్యాలను ఉపయోగించుకొని తమ జీవితాలకు కుటుంబానికి ఆర్థిక భరోసా పొందాలని కమిషనర్ సూచించారు. పట్టుదలతో కష్టపడి మహిళలందరూ సంఘాలుగా ఏర్పడి పలు ఉత్పత్తులను తయారు చేసి ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న తీరును ఆయన ప్రశంసించారు. కమిషనర్ తో పాటు మున్సిపల్ మేనేజర్ జయకర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి,స్టాల్స్ ను సందర్శించారు.

# తెలుగువారి పండుగలలో ఉగాది ముఖ్యమైనది

**గుంటూరు విద్య, మార్చి 18, ప్రభాతవార్త :** తెలుగువారి పండుగలలో ఉగాది ఎంతో ముఖ్యమైనదని ఎన్నో పనుల ప్రారంభ దినముగా ఉగాదిని తెలుగు వారు జరుపుకుంటారని ఇలాంటి విశిష్టమైన పండుగను తెలుగువారి ముంగిట్లో జరుపు కోవటం తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల సందర్భంగా ఏసుబాబు మాదిగ మాట్లాడారు. ఆంగ్ల సంవత్సరాది జనవరి 1న ప్రారంభమవుతుండగా, మన తెలుగు సంవత్సరాది చైత్రమాసంలో ప్రారంభమవుతుందన్నారు. రానున్న సంవత్సరాన్ని పరాభవ నామ సంవత్సరముగా వ్యవహరిస్తారన్నారు. శిశిరంలో మోడైపోయిన చెట్లని ,వసంతంలో చిగుళ్ళు తొడిగి కొత్త సింగారాల్లు తొడుగుతాయన్నారు. రుతువుల్లో మొదటిదైన వసంతం ఇది మనోహరమైనదనీ ఆహ్లాదకరమైనది కూడా అని అన్నారు. ఉత్కంఠ గొల్పే సంవత్సర ఫలితాలను కందాయ ఫలాలను పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకోవడం ఉగాది నాటి ముఖ్య వేడుకన్నారు. అన్ని రుచుల సంకేతం ఉగాది పచ్చడి అని పేర్కొన్నారు. కొత్త చిగుళ్ళతో రంగురంగుల పూలతో పరిమళాల పన్నీరుతో కొమ్మ కొమ్మకి మామిడి తోరణాలు, కోయిల పాటల వసంతానికి పచ్చని గుర్తులై శుభం పలుకుతాయని ఇలాంటి ఉగాది ప్రత్యేకత అంతా కాదు అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఉగాది రోజున ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో నిర్ణయాలు తీసుకొని భవిష్యత్తును బంగారు మయంగా చేసుకునే దిశగా పయనించాలని ఈ సందర్భంగా ఏసుబాబు మాదిగ సూచించారు.



# ఆర్‌విఆర్‌జెసి ఇంజినీరింగ్ కళాశాలలో మినీ హ్యాకథాన్

**గుంటూరు విద్య, మార్చి 18, ప్రభాతవార్త :** హ్యాకథాన్‌లు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, వాస్తవ సమస్యలకు ఆవిష్కరణాత్మక పరిష్కారాలను కనుగొనే సామర్థ్యాన్ని



పెంచుతాయని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఏఐ స్పెక్ట్రమ్ క్లబ్ ఆఫ్ నెక్సా, నెక్స్ట్ జెన్ ఇంజినీర్స్ మరియు ఏఐ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 8 గంటల మినీ హ్యాకథాన్ నిర్వహించారు. ఈ మినీ హ్యాకథాన్‌లో విద్యార్థులు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, వెబ్ + ఏఐ అప్లికేషన్స్, ఆటోమేషన్ / ఏఐ ఏజెంట్స్ వంటి విభిన్న రంగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, మొమెంటోలు మరియు సర్టిఫికెట్లు అందజేశారు. ఇలాంటి హ్యాకథాన్‌లు విద్యార్థులను గ్లోబల్ స్థాయి సాంకేతిక పోటీలకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల ఏ.ఐ ఎమ్.ఎల్ విభాగాధిపతి డా.జి. రాంమోహన్ బాబు, కన్వీనర్ డా.ఎమ్ .శ్రీధర్, డా. అలపర్తి ముద్దు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# 22న శ్రీ వామన చరిత్ర ప్రవచనము



**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** ప్రతి మాసం వాణీ దరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం 6.30గంటలకు బ్రాహ్మణ బజారులోని గాయత్రీ మందిరం, శంకరమఠంలో శ్రీ వామన చరిత్రము అనే అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ మహాసభ కార్యదర్శి, కోశాధికారులు ఎఆర్‌కెఎస్టీ సాయి, దేశిరాజు బాలగంగాధరతిలక్ చెప్పారు. సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఏదో ఒక సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇది నిరంతరం ప్రతి నెలా కొనసాగుతుందన్నారు. ప్రవచన కర్త పావులూరి బలరామకృష్ణ ప్రవచనం చేస్తారని చెప్పారు. సాహితీ ప్రియులు, భాషాభిమానులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి కార్యక్రమం సజావుగా జరిగేవిధంగా చూడాలని నిర్వాహకులు కోరారు.

# మంచి చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## -వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** మంచి చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం మాత్రమేనని వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్టీసి డిపో ప్రాంగణంలో బుధవారం దివ్యాంగుల శక్తి పథకం ప్రారంభించారు. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం ఆర్టీసి బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించడమేనన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేస్తూ ఇది మంచి ప్రభుత్వమనే పేరును ప్రజల్లో సంపాదించుకున్నారన్నారు. గుంటూరు పార్లమెంట్ రైతు విభాగం నాయకుడు బొర్రు రామారావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దివ్యాంగులు స్వతంత్రంగా ప్రయాణించడానికి, వారి దైనందిన అవసరాలను సులభతరం చేసుకొనేందుకు ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లమూడి బాబూరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, యన్నం నాయుడు, గోవాడ వెంకటకృష్ణారావు, మురుగుల సాంబశివరావు, కత్తుల రవికిరణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



# రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## -మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని



**చేబ్రోలు(పొన్నూరు), మార్చి 18,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు రైతులు ప్రధానంగా ఐదు వ్యవసాయ కార్యాచరణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులు నీటి భద్రత గురించి, డిమాండ్ ఆధారిత పంటల సాగు గురించి, వ్యవసాయంలో సాంకేతిక వినియోగంపై, ఫుడ్ ప్రాసెసింగ్ గురించి, రైతులకు గిట్టుబాటు ధర, ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జి.మోహన్, వ్యవసాయ గ్రామ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ప్రచార యావకు ప్రజలు బలి

## -కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రచార యావ తారాస్థాయి చేరిందని, కనీస ముందు చూపు కూడా మందగించిందని, పేద, మధ్య తరగతి ప్రజలను బలిపశువులను చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ



మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత నెలకొన్న నేపథ్యంలో దిలీప్ మాట్లాడారు. గత పన్నెండేళ్ళుగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రచారానికిచ్చిన ప్రాధాన్యత ప్రజలకు ఇవ్వకపోవడం ఈ దేశ ప్రజల దురదృష్టమన్నారు. మోదీ ప్రచార యావకు దేశ ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారన్నారు. నోట్ల రద్దు, కోవిడ్ సన్నద్ధత, కరెంటు నిల్వలు నేడు గ్యాస్ కొరతలు ఇలా ముందుచూపులేని పాలనకు కేంద్రంలోని ఎన్డియే సర్కార్ బ్రాండ్ ఎంబాసిడర్గఆ మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసమర్థ పాలనతో పండుగల వేళ గతంలో ఎన్నడూ లేని విధంగా వంట గ్యాస్ కొరత, ధరాఘాతంతో పేద, మధ్య తరగతుల ఇళ్ళల్లో పాత్రలు నిండుకున్నాయన్నారు. మరో వైపు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి, కృత్రిమ కొరతను సృష్టించడంతో దేశవ్యాప్తంగా హోటల్ రంగం కనీవిని ఎరుగని రీతిలో దెబ్బతిందన్నారు. ఎన్డియే అనాలోచిత పాలనలో దేశ వ్యాప్తంగా చిరువ్యాపారులు ప్రతిసారి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను మతం మత్తులోజోగేలా చేస్తూ రాక్షస పాలన చేస్తున్న బిజెపిని దానితో అంటకాగుతున్న ప్రాంతీయ పార్టీలను ప్రజలు తరిమికొట్టే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.

# విజ్ఞాన్స్ వర్సిటీకి రూ.38.88లక్షల ప్రాజెక్టు మంజూరు

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులను న్యూఢిల్లీలో గల భారత ప్రభుత్వ డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నుంచి రూ.38.88లక్షలు విలువ గల ప్రాజెక్టు మంజూరైనట్లు వర్సిటీ ఇంచార్జి వీసి ప్రొఫెసర్ కేవి క్రిష్ణకిషోర్ బుధవారం తెలిపారు.ఈ సందరభంగా వీసి మాట్లాడుతూ ఫోటో సింథటిక్ ప్లాస్మోనిక్ బయో సెమికండక్టర్ నానోహైబ్రిడ్స విత్ సింగిల్ ఆటమ్ నానోజైమ్స్ యాన్ ఇన్నోవేటివ్ టెక్నాలజీ ఫర్ సెలెక్టివ్ సివోటూ టు ఫ్యూయల్ కన్వర్షన్ అనే అంశంపై రెండు సంవత్సరాల పాటు ఈ ప్రాజెక్టు అమలు చేయబడుతుందని వెల్లడించారు.ఈ పరిశోధనలో ఫోటో సింథటిక్ ప్లాస్మోనిక్ బయో సెమీకండక్టర్ నానో హైబ్రిడ్స్‌ను సింగిల్ ఆటమ్ నానోజైమ్స్‌తో సమన్వయం చేసి, కార్బన్ డయాక్సైడ్‌ను సమర్థవంతంగా ఎంపికాత్మకంగా స్వచ్ఛమైన ఇంధనంగా మార్చడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పొందిన అధ్యాపకులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇంచార్జి వీసి క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.




# ఘనంగా అవ్వారు ఆదెమ్మ వర్ధంతి

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** స్వర్ణపురి పట్టణంలోని దేవాదాయధర్మాదాయశాఖ నిర్వహణలోని అవ్వారు ఆదెమ్మ ధర్మసత్రంలో అవ్వారు ఆదెమ్మ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నాడు దాతలు ఏర్పాటు చేసిన ఈ ధర్మసత్రంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి చేయూతనిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం అవ్వారు ఆదెమ్మ వర్ధంతి సందర్భంగా పలువురు విద్యార్థులకు ఉపకారవేతనాలను



అందజేశారు. దాతల లక్ష్యాన్ని కాపాడతామని అధికారులు, ఫౌండర్ ట్రస్టీ సభ్యులు తెలిపారు. తొలుత అవ్వారు ఆదెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అవ్వారు వెంకటేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణచౌదరి, జిల్లా ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు, షేక్ బాజిసాహెబ్, గుప్తా, పఠాన్ పిరోజ్‌ఖాన్, కోట రవి, వీరమల్లు మోహనరావు, రాచపూడి విఘ్నేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్, అధికారులు నిడమానూరి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా



తిరుమలశెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవసరార్థులకు రక్తాన్ని అందించడమే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుతున్నామన్నారు. సంస్థ తరపున కార ్యక్రమాలు చేస్తున్నామంటే అది మా గొప్పతనం కాదని, దాతలు సంస్థను నమ్మి ముందుకు వస్తున్నారని, అందుకే సేవా కార్యక్రమాలు నిర్వహణ కూడా సులభతరమైందన్నారు. దాతల సహకారంతోనే సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ విధంగా చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి చిలకపాటి సింహాద్రి, రత్నం, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# మామిళ్ళపల్లిలో ఇఫ్తార్ విందు

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పలువురు ముస్లీం నాయకులు పాల్గొని విందును వడ్డన చేశారు. తొలుత మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లీంలకు అత్యంత పవిత్రమైన పండుగల్లో రంజాన్ ఒకటన్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లీంలు కఠోరమైన ఉపవాస దీక్షలు చేయడం, దాన ధర్మాలు చేయడం వంటివి అత్యంత భక్తిశ్రద్ధలతో చేస్తారన్నారు. రంజాన్ పర్వదినాన్ని సుఖశాంతులతో, భక్తిప్రపత్తులతో జరుపుకోవాలని ముస్లీం మైనార్టీ నియోజకవర్గ నాయకుడు పఠాన్ పిరోజ్‌ఖాన్, అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్ కోరారు.



# పార్టీ పటిష్టతకు పనిచేయాలి

## -మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి

**పొన్నూరు, మార్చి 18,ప్రభాతవార్త:** పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి కోరారు. ఇటీవల డాక్టర్ రూత్‌రాణికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించింది. దీంతో నాయకులు,కార్యకర్తలు రూత్‌రాణి ఇంటి వద్దకు వచ్చి పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేస్తున్నారు. దీంతో రూత్‌రాణి స్వగృహం నాయకులు,కార్యకర్తలతో కోలాహలంగా తయారైంది. ఈ కార్యక్రమంలో చింతలపూడి మురళీకష్ణ, షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలున్నారు.



